
గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి దిగువన వరద ప్రవాహం ఇలా..

గుండ్లకమ్మ ఉగ్రరూపం

రిజర్వాయర్‌లోకి లక్ష క్యూసెక్కుల వరద

- ప్రాజెక్టు ప్రారంభించాక ఇదే అధికం
- 24 గంటల్లో దిగువకు 7 టీఎంసీలు
- పలు గ్రామాల్లోకి చేరిన వరద నీరు
- జలదిగ్బంధంలో మద్దిరాలపాడు, చీర్వానుప్పలపాడు
- ఒంగోలు-చీరాల హైవేపై రవాణాకు బ్రేక్
- వెల్లంపల్లి-తాళ్లూరు, త్రోవగుంట-ఉలిచి మార్గంలోనూ వాహనాల నిలిపివేత
- ఉప్పలపాడులో చిక్కుకున్న 50 మంది
- ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాల ద్వారా ఆహారం, నీరు అందజేత

ఒంగోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్‌తో కురిసిన భారీ వర్షాలతో ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో గుండ్లకమ్మ ఉగ్రరూపం దాల్చింది. మూడు రోజులుగా ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వస్తుండగా బుధవారం సాయంత్రం నుంచి గురువారం సాయంత్రం వరకు సగటున లక్ష క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చింది. దాదాపు 7 టీఎంసీల నీటిని గేట్లు ఎత్తి దిగువకు వదిలారు. దీంతో గుండ్లకమ్మ నదిలోంచి వదిలిన నీరు దిగువ ప్రాంతంలోని పలు గ్రామాలను ముంచెత్తింది. చీరాల హైవేపై ఉన్న మద్దిరాలపాడు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకోగా పలు ఇతర గ్రామాల్లోకి వరదనీరు చేరి ప్రజలు ఆందోళనకు గురయ్యారు. గుండ్లకమ్మ ప్రాజెక్టును ప్రారంభించి 17 ఏళ్లు అవుతుండగా ప్రాజెక్టు ప్రారంభించాక ఈ స్థాయిలో వరదనీరు రావడం ఇదే ప్రథమం. మద్దిపాడు మండలం చిన్నమల్లవరం వెంకటేశ్వరస్వామి గుడి వద్ద గుండ్లకమ్మ ప్రాజెక్టు ఉంది. సుమారు 3.89 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టుకు గిద్దలూరు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతం

మిగతా 6లో...


ఉలిచి మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు


చీర్వానుప్పలపాడు గ్రామాన్ని చుట్టుముట్టిన గుండ్లకమ్మ వరద


మార్కాపురం మండలం బొందలపాడులో దెబ్బతిన్న మిరపను చూపుతున్న రైతు ఎర్రారెడ్డి

వదలని వరద

మొంథా దెబ్బ నుంచి తేరుకోని జిల్లా జనం

- ఇక్కట్లలోనే పలు ప్రాంతాలు
- గుండ్లకమ్మకు కొనసాగుతున్న వరద
- వాగులు, వంకలు అదే పరిస్థితి
- అధికచోట్ల దెబ్బతిన్న రోడ్లు
- చాలాచోట్ల రవాణాకు ఆటంకం
- ఇంకా నీటిలోనే పంటలు

మొంథా తుపాన్ ధాటి నుంచి జిల్లా ప్రజానీకం ఇంకా తేరుకోలేదు. తుఫాన్ గండం గడిచినా వర్షాలు ఆగిపోయినా పైనుంచి వస్తున్న నీటి ప్రవాహాలతో ప్రజలు ఇక్కట్లు పడుతూనే ఉన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు వరద కొనసాగుతుండగా చాలా ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతూనే ఉన్నాయి. మరోవైపు అనేకచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో చాలాప్రాంతాల్లో రవాణాకు తీవ్ర ఆటంకంగానే ఉండగా గుండ్లకమ్మ ప్రాజెక్టు దిగువ ప్రాంతంతోపాటు ఇతరచోట్ల పలు గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. మరోవైపు ఇంకా వేలాది ఎకరాల్లోని పంటలు నీటిలోనే ఉండగా తుఫాన్ అనంతరం చర్యలు, ప్రజలకు తక్షణ సహాయక కార్యక్రమాలు, పరామర్శలపై అటు అధికార యంత్రాంగం, ఇటు ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ నేతలు దృష్టి సారించారు.

ఒంగోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేవలం 36 గంటల్లోనే 18.40 సెం.మీ. వర్షపాతంతో జిల్లాను మొంథా తుఫాన్ అతలాకుతలం చేసింది. దానివల్ల జనజీవనం స్తంభించిపోవడంతోపాటు పంటలు, ఇతర ఆస్తులకు భారీనష్టం వాటిల్లింది. అయితే బుధవారం ఉదయం వర్షాలు ఆగిపోయి ఎండలు వచ్చినా చాలాచోట్ల వరద ఉధృతి కొనసాగుతోంది. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు గురువారం సాయంత్రం కూడా భారీగానే వరద వస్తోంది. సుమారు 98వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా 10 గేట్లు ఎత్తి 80వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. దీంతో గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. జిల్లావ్యాప్తంగా అత్యధిక ప్రాంతాల్లో వాగులు, వంకలలో నీరు ఉధృతంగానే ప్రవహిస్తోంది. చాలాప్రాంతాల్లో రవాణా నిలిచిపోయింది.

● గుండ్లకమ్మ వరదతో మద్దిరాలపాడు వద్ద హైవేపై భారీగా ప్రవాహంతో ఒంగోలు-చీరాల మార్గంలో రవాణా ఆగిపోయింది. గుండ్లకమ్మ పొంగడంతో వెల్లంపల్లి- తాళ్లూరు, త్రోవగుంట-ఉలిచి, వాగు పొంగి ఒంగోలు-కొత్తపట్నం, టంగుటూరు-కొండపి, టంగుటూరు-కామేపల్లి, ఎస్‌ఎన్‌పాడు-కొండపితోపాటు ఇతర ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి.

● అనేకచోట్ల రోడ్లు ధ్వంసమై కూడా రవాణాకు ఆటంకం ఏర్పడింది. అర్ధవీడు మండలం గోల్లపల్లి వద్ద చప్టాకోతకు గురై 10 గ్రామాలకు రవాణా నిలిచిపోగా ఇతర అనేకచోట్ల ఇలాంటి పరిస్థితి నెలకొంది.

దెబ్బతిన్న పంటలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెరువులు నిండి అలుగులు ఉధృతంగా ప్రవహిస్తుండగా అక్కడక్కడా గండ్లు కూడా పడ్డాయి. మరోవైపు వేలాది ఎకరాల్లోని పంటలు ఇంకా నీటిలోనే ఉన్నాయి.

● పశ్చిమ ప్రాంతంలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. అనేక గ్రామాల్లో పత్తి, కంది, మిర్చి, మినుము, సజ్జ, వరి, మొక్కజొన్న, ఇలా అన్నిరకాల పంటలు నీళ్లలోనే ఉండటంతో తీవ్రంగా నష్టపోతామని

మిగతా 6లో...


మద్దిరాలపాడు గ్రామాన్ని ముంచెత్తిన వరద


దోర్నాల మండలం కటకానిపల్లె పొలంలో నిలిచిన వరద


మార్కాపురం మండలం జమ్మనపల్లిలో నీట మునిగిన మిరప


ముండ్లమూరు మండలం వేంపాడులో పడిపోయిన వరి పైరు


ఒంగోలులో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు


కరవదిలో ఇటుక బట్టీలోకి చేరిన వరద నీరు


వరద నీటి ఉధృతికి దెబ్బతిన్న కారుమంచి-మల్లవరప్పాడు రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి స్వామి


కోతకు గురైన మద్దులూరు-మాచవరం రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

ఒంగోలు అతలాకుతలం

- తీవ్రప్రభావం చూపిన మొంథా తుఫాన్
- 24 గంటల్లో 25.72 సెం.మీ. వర్షపాతం
- నగరాన్ని ముంచెత్తిన వాన
- ఆపై పేర్నమిట్ట, ఎస్‌ఎన్‌పాడు, పెళ్లూరు చెరువుల నుంచి 15వేల క్యూసెక్కులు
- పొంగిన పోతురాజుకాలువ, నల్లవాగు
- ముంపునకు గురైన 53 కాలనీలు
- 11వేల కుటుంబాలపై ఎఫెక్టు
- ఎమ్మెల్యే జనార్దన్ చొరవ, అధికారుల కృషితో 24 గంటల్లోనే నగరంలో సాధారణ స్థితి

ఒంగోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ఒంగోలు నియోజకవర్గాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. నగరంతోపాటు ఒంగోలు రూరల్, కొత్తపట్నం మండలాల్లోనూ ఇంకా ప్రజానీకం కుదటపడలేదు. ఒకవైపు తుపాన్ ప్రభావంతో కుండపోత వర్షం, మరోవైపు ఎగువన ఉన్న ఎస్‌ఎన్‌పాడు, పేర్నమిట్ట, పెళ్లూరు చెరువుల నుంచి పోటెత్తిన వరదనీరు ఒంగోలు నగరాన్ని ముంచెత్తగా ఆ ప్రభావం దిగువ ప్రాంతంలోని కొత్తపట్నం మండలంపైనా తీవ్రంగా

మిగతా 6లో...


భారీగా వరద చేరి చెరువును తలపిస్తున్న కరవది - చేజర్ల రహదారి


ఒంగోలులోని కిమ్స్ వద్ద వరదలో పరిస్థితి ఇలా..

తిమ్మసముద్రంలో ఉద్రిక్తత

టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వివాదం

వరద బాధితుల వివరాల నమోదులో వాదులాట

నాగులుప్పలపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వరద బాధితుల పరిహారం నమోదు విషయంలో తిమ్మసముద్రంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య గురువారం రాత్రి వివాదం చెలరేగింది. గ్రామంలోని అంబేడ్కర్‌నగర్, బీసీ కాలనీలలోకి కొమ్మమూరు కాలువ పొంగి వరదనీరు చేరడంతో ఆర్డీవో ప్రసన్నలక్ష్మి, ప్రత్యేకాధికారి జోసఫ్‌కుమార్, ఇతర అధికారులు పరిశీలించి బాధితుల వివరాలు నమోదు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బాధితుల వివరాలు నమోదు చేసిన వీఆర్‌వో వాటిని కంప్యూటరీకరణ చేస్తుండగా అధికార పార్టీ నాయకులు జోక్యం చేసుకొంటున్నారని ఆరోపిస్తూ వైసీపీ వర్గీయులు వాదనకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదులాట చోటుచేసుకుంది.



ఒంగోలు కాశీవిశ్వేశ్వర ఆలయంలో భక్తుల పూజలు

ఘనంగా కోటిసోమవార పూజలు

ఒంగోలులోని ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కోటి సోమవార పూజలను గురువారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం శ్రవణా నక్షత్రం ఉండటంతో కోటి సోమవారంగా జరుపుకున్నారు. ఒంగోలు కేశవస్వామిపేట గంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండు రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, అంజయ్య రోడ్డు పంచముఖ శివాలయం తదితర పలు ఆలయాలకు గురువారం భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

● కోటి సోమవారం సందర్భంగా శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి పుష్పయాగం గురువారం స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కన్నులపండుగగా జరిగింది.

పెళ్లికి వరద కష్టం

ఎక్స్‌కవేటర్‌లో వధువు తరలింపు

- సింగరాయకొండకు చేరుకున్న వరుడు
- ముసి ఉధృతితో గ్రామం దాటి వెళ్లలేకపోయిన వధువు
- పోలీసుల చొరవతో సురక్షితంగా కల్యాణ వేదికకు చేరిక

మెయిన్‌లో

లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల జైలు

7

సీఎం చంద్రబాబు ముందుచూపుతోనే ముప్పు తప్పింది

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

- పాతసింగరాయకొండ పరిధిలోని మల్లికార్జున్‌నగర్‌లో దామచర్ల సత్యతో కలిసి గిరిజనులకు బియ్యం పంపిణీ

మెయిన్‌లో




బేస్తవారపేటలో కత్వా వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ప్రమాద స్థాయికి గుండ్లకమ్మ ప్రవాహం

సప్లై చానల్‌ను వెడల్పు చేసి నీటి మళ్లింపు

ఊపిరిపీల్చుకున్న ప్రజలు



సోమవారపేట వాగులో చిక్కుకున్న ఇల్లు

బేస్తవారపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలో కురిసిన వర్షానికి కంభం చెరువు పూర్తిగా నిండి అలుగుపారుతున్న నేపథ్యంలో బేస్తవారపేటలోని సోమవారపేట వద్ద సీతురేలు కతువకు నీటి ప్రవాహం ప్రమాదస్థాయికి చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం ఉదయానికి భారీగా వరద పారుతుండడంతో కతువ చానల్ ద్వారా నీరు వెళ్లలేక సమీపంలోని గృహాలు, పంట పొలాల్లోకి చేరింది. దీంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అధికారులు ఎక్స్‌కవేటర్ సాయంతో సప్లై చానల్‌ను వెడల్పు చేసి నీటిని బయటకు పంపడంతో అది మార్కాపురానికి చేరింది. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. వారితోపాటు మార్కాపురం డీఎస్పీ నాగరాజు, సీఐ మల్లికార్జున, తహసీల్దార్ జితేంద్ర, ఇండ్లా శేఖర్‌రెడ్డి ఉన్నారు.

పారిన గండిచెరువు అలుగు

అర్ధరాత్రి నిలిచిన రాకపోకలు

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎర్రగొండపాలెం మండలం వ్యాప్తంగా చెరువులు నిండి పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని వెంకటాద్రిపాలెం - వీరభద్రాపురం మధ్యలో ఉన్న గండిచెరువు నిండి అలుగు పారుతోంది. దీంతో చుట్టుపక్కల ఉన్న పొలాలు నీట మునిగాయి. అలుగు పారుతుండడంతో వీరభద్రాపురం మీదుగా ఎర్రగొండపాలెం, మురారిపల్లి చెరువుకు నీరు వస్తోంది. మధ్యలో ఉన్న వీరభద్రాపురం నుంచి గడ్డమీదపల్లికి వెళ్లే వీలు లేకపోవడంతో బుధవారం అర్ధరాత్రి ప్రజలు పడిగాపులుగాశారు. స్థానికుల సహకారంతో గ్రామానికి చెరుకున్నట్లు వారు తెలిపారు.



బోర్ల నుంచి వస్తున్న నీరు

బోర్ల నుంచి ఉబుకుతున్న నీరు

వ0ండలంలోని అయ్యంబొట్లపల్లి చెరువు నిండింది. దీంతో ఆ ప్రాంతాలలో ఉన్న గంగపాలెం, అయ్యంబొట్లపల్లి పరిసర ప్రాంతాలలో బోర్ల నుంచి మోటార్లు వేయకుండానే నీరు ఉబుకుతున్నట్లు రైతులు తెలిపారు.



వీరభద్రాపురం వద్ద వాగులో పారుతున్న వర్షం నీరు



చెరువు నీరంతా పొలాల్లోకి వెళుతున్న దృశ్యం

పూడిపోయిన సప్లై చానల్

పొలాల్లోకి మళ్లిన చెరువు నీరు

రాచర్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సప్లై చానల్ పూడిపోవడంతో చెరువు నీరంతా పొలాల్లోకి వెళ్లిన ఘటన మండలంలోని సత్యవోలు గ్రామంలో చోటుచేసుకుంది. తుఫాన్‌తో అన్ని గ్రామాల చెరువులు దాదాపు నిండాయి. సత్యవోలు దశబంధ చెరువు కూడా నిండడంతో సాగు, తాగు నీటి కష్టాలు తీరతాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈలోపే చెరువుకు చెందిన సప్లై చానల్ పూడిపోయి నీరంతా పొలాల్లోకి వెళ్లడంతో రైతులు ఇబ్బందుల్లో పడ్డారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేసి, నీరు పొల్లాలోకి రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

కాలువ మరమ్మతులు ప్రారంభం

గుండ్లకమ్మ నుంచి మార్కాపురం చెరువు చానల్‌లో నీరు వృథా కాకుండా ఉండేందుకు మండలంలోని మాల్యవంతుని పాడు వద్ద కాలువకు మరమ్మతు పనులను గురువారం ఎమ్మెల్యే కందుల ఇరిగేషన్ అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించారు.మార్కాపురం చెరువు సప్లై చానల్‌కు గుండ్లకమ్మ నుంచి వేరయ్యే ప్రదేశాన్ని పరిశీలించారు.

వదలని వరద

(5వ పేజీ తరువాయి)

రైతులు ఆందోళన చెందుతున్నారు.

● పంటలను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వర్షం తెరిపి ఇవ్వడంతో తుఫాన్ అనంతర చర్యలపై ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు దృష్టిసారించారు. సహాయక, పునరావాస శిబిరాల్లోని వారికి ఆహారం అందించి తిరిగి ఇళ్లకు వెళ్లే ఏర్పాట్లు చేస్తూ జలమయమైన నివాస ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు.

● ఇళ్లలోకి చేరిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన బియ్యం, ఇతర వస్తువులు అందజేస్తున్నారు.

సహాయక చర్యల్లో యంత్రాంగం

చాలాచోట్ల పంటలు దెబ్బతినగా వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు వాటిని పరిశీలించి ఉన్న పంటల రక్షణపై రైతులకు సూచనలు చేస్తుండగా దెబ్బతిన్న రోడ్లు, తెగిన చెరువులు, పొంగిన వాగుల వద్ద అత్యవసరమైన పనులు చేపట్టారు. మరోవైపు బాధితులను పరామర్శిస్తూ, దెబ్బతిన్న వనరులను పరిశీలిస్తూ అధికార యంత్రాంగం చేపడుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించి తుఫాన్ ప్రభావానికి గురైన ప్రజలకు భరోసా కల్పించే పనిలో ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ నేతలు గురువారం కనిపించారు.

● మంత్రి డాక్టర్ స్వామి టంగుటూరు మండలంలో దెబ్బతిన్న కారుమంచి రోడ్డును పరిశీలించడంతోపాటు ఆలకూరపాడులో పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఉన్నవారికి అందుతున్న సహాయక చర్యలను పరిశీలించారు.

● ఒంగోలు సమీపంలోని చెర్వుకొమ్ముపాలెంలో బాధిత కుటుంబాలకు మంత్రి డాక్టర్ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఎండీ ఢిల్లీరావు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

నేతల పరిశీలన

ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయకుమార్ మద్దిపాడు మండలం గుండ్లాపల్లిలో పునరావాస కేంద్రాన్ని, చీమకుర్తి మండలంలో దెబ్బతిన్న ఎర్రగుడిపాడు వాగు ప్రాంతాన్ని సందర్శించారు. మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి దెబ్బతిన్న పలు నీటి వనరులను పరిశీలించడంతో పాటు పంట నష్టాలపై వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షించారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ సింగరాయకొండలో తుఫాన్ తాకిడికి గురైన పలు గ్రామాల ప్రజలతో మాట్లాడటంతోపాటు దెబ్బతిన్న వనరులు పరిశీలించారు. టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ముండ్లమూరు మండలంలో దెబ్బతిన్న పంటలు, రోడ్లు, కోతకు గురైన నీటి వనరులను పరిశీలించారు. వర్షాలతో బాగా నాని పలుచోట్ల పొగాకు బ్యారన్లు, ఇళ్ల గోడలు వంటివి కూలాయి.

తుఫాన్ బాధితులకు అండగా ప్రభుత్వం

రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య

సింగరాయకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ వలన నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య భరోసా కల్పించారు. మండలంలోని తీరప్రాంత గ్రామాలైన పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి గ్రామాల్లో ఆయన గురువారం టీడీపీ నేతలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. తొలుత బింగినపల్లి పంట చెరువును పరిశీలించారు. ప్రమాదహేతువుగా ఉన్న రింగ్‌బండ్‌ను పటిష్ఠం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



బింగినపల్లి చెరువుకట్టను పరిశీలిస్తున్న దామచర్ల సత్య

అనంతరం ఊళ్లపాలెం పంచాయతీ పరిధిలోని బేసిన్‌పల్లెపాలెం, దేవళంపల్లెపాలెం, బావివద్దపల్లెపాలెంలో లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షపు నీటిని వెంటనే బయటకు పంపించి క్లోరినేషన్ చేపట్టాలని అధికారులకు సూచించారు. తదనంతరం పాకల పోతయ్యగారిపట్టపు పాలెం, క్రాంతినగర్, పాకల బీచ్‌లో పర్యటించారు. మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావంతో వేటకు వెళ్లని మత్స్యకారులను కూడా ప్రభుత్వం ఆదుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు. సోమరాజుపల్లి పంచాయతీలోని గిరిజనకాలనీ అప్పాపురం పర్యటించి గిరిజనుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్‌బీవీ రాజేష్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న ప్రతి ఎకరాకు పరిహారం అందేలా చర్యలు తీసుకోండి

మార్కాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రతి ఎకరాకు నష్టపరిహారం అందేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి సూచించారు. జవహర్‌నగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో గురువారం వ్యవసాయాధికారులతో సమీక్షించారు. ఉధృతి తగ్గిన వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలని ఎమ్మెల్యే సూచించారు. గుండ్లకమ్మ నది, తెగిన చెరువులు, పొంగిన వాగులు, వంకలు ఉన్న ప్రాంతాల్లోని పొలాలను పరిశీలిస్తే తీవ్రత తెలుస్తుందన్నారు. ఏడీఏ బాలాజీనాయక్, ఏవోలు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

మార్కాపురం రూరల్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉం టుందని ఎమ్మెల్యే నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దనాగులవరం, భూపతిపల్లి పునరావాసా శిబిరాల్లో ఉన్న వరద బాధితులకు ఎమ్మెల్యే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. తహసీల్దార్ చిరంజీవి, సొసైటీ చైర్మన్ రామాంజులరెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తెప్పోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలి

మార్కాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం చిలుక ద్వాదశి రోజున ఆదివారం నిర్వహించే లక్ష్మీచెన్నకేశవస్వామి తెప్పోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కందుల చెప్పారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో తెప్పోత్సవం ఏర్పాట్లపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.



వ్యవసాయాధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఫీడర్ కెనాల్‌కు గండ్లు

పొలాలపై ప్రవహించిన వరద

పంటలను కాపాడుకోలేక రైతుల అవస్థలు

పెద్దదోర్నాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ రైతుల పాలిట శాపంగా మారింది. మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి వరద పోటెత్తి ఫీడర్ కాలువకు చేరడంతో కటకానిపల్లె, యడవల్లి వద్ద కాలువకు గండ్లు పడ్డాయి. వరద నీరు పంట పొలాలపై ప్రవహించడంతో మిరప, అరటి, పత్తి తదితర పంటలు నీట మునిగాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన పైర్లు నీటిపాలవ్వడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల కష్టం, పెంచిన పైరు మళ్లీ ఎప్పటికి వస్తుందని వాపోతున్నారు. నాలుగు రోజులుగా తిమ్మాపురం, కడపరాజుపల్లె, ఐనముక్కుల, పెద్ద బొమ్మలాపురం, కొత్తూరు జమ్మిదోర్నాల, చిన్నగుడిపాడు, చిన్నదోర్నాల, రామచంద్రకోట తదితర గ్రామాల్లో నీటి వరద ప్రవాహం తగ్గలేదు. పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.



యడవల్లి వద్ద తెగిన ఫీడర్ కెనాల్

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

» **ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి**

» **సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ**

కనిగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం సీఎం సహాయనిధి కింద రూ.36లక్షల 68వేల 368మేర చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి మండలంలోని ఏరువారిపల్లికి చెందిన ముప్పూరి వెంకటలక్ష్మీకి అనారోగ్యంతో వైద్యం చేయించుకుని సీఎం సహాయనిధికి దరఖాస్తుచేసుకున్నట్లు చెప్పారు. అర్హత లేకపోవటంతో ఆ దరఖాస్తును తిరస్కరించారన్నారు. బాధిత మహిళ భర్త వెంకటేశ్వర్లు నేరుగా మంత్రి లోకేష్‌కు తన ఆర్థిక స్థితిని, జరిగిన వైదాన్ని, తిరస్కరించిన తీరును వివరిస్తూ ఎక్స్ ద్వారా మెసేజ్ చేశాడని చెప్పారు. వెంటనే మంత్రి లోకేష్ స్పందించి నేరుగా తనకు ఫోన్ చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర తెలిపారు. వెంకటేశ్వర్లు పార్టీకి విధేయుడిగా ఉండట మే కాకుండా టీడీపీ కార్యక్రమాలను నిర్వహిస్తూ ఎంతో కృషి చేసినట్లు మంత్రి లోకేష్‌కు వివరించానన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి వెంకటలక్ష్మీకి సీఎం సహాయనిధి కింద రూ.67 వేలు మంజూరు చేస్తూ చెక్కును పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

ఒంగోలు అతలాకుతలం

(5వ పేజీ తరువాయి)

చూపింది. తుఫాన్‌తో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు సగటున 18.33సెం.మీ, వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అర్బన్ మండలంలో 25.72 సెం.మీ, రూరల్ మండలంలో 25.72సెం.మీ, కొత్తపట్నం మండలంలో 23.28సెం.మీ వర్షపాతం నమోదైంది. అలా జిల్లాలోకెల్లా అత్యధిక వర్షపాతం, అందులోనూ 24 గంటల వ్యవధిలో ఏకంగా 25సెం.మీ.పైగా కురవడంతో నగరం జలదిగ్బంధంలో చిక్కుకుంది. మరోవైపు ఎగువ ప్రాంతంలో ఉన్న ఎస్ఎన్‌పాడు చెరువు పూర్తిగా నిండి దిగువకు నీరు పోటెత్తగా మైనంపాడు, ఎండ్లూరు ప్రాంతాల నుంచి ఒంగోలు నగరంపైకి వరద వచ్చింది. పేర్నమిట్ట చెరువుకు గండిపడి ఆ నీరంతా పోతురాజు కాలువకు రావడంతో అది పొంగింది. అలా రెండింటి ద్వారా దాదాపు 14వేల క్యూసెక్కుల నీరు కొన్ని గంటల పాటు నగరంలోకి వచ్చింది. మరోవైపు పెళ్ళూరు చెరువు నుంచి 1500 క్యూసెక్కుల నీరు నగర దక్షిణ ప్రాంతానికి చేరాయి. సంతనూతలపాడు మండల దక్షిణ ప్రాంతంలో కురిసిన నీరు నల్లవాగును ముంచెత్తింది. అసలే కుండపోత వర్షం నగరాన్ని ముంచెత్తగా ఆపై ఎగువ నుంచి వేల క్యూసెక్కుల వరద నీరు రావడంతో ఇటు పోతురాజు కాలువ, అటు నల్లవాగులు పొంగాయి. దీంతో నగరంలో నీరు గంటల కొద్ది బయటకు వెళ్ళే అవకాశం లేక పలు ప్రాంతాలు మునిగాయి. అలా బుధవారం ఉదయానికి ఎటుచూసినా చెరువులను తలపించే రీతిలో నగరం కనిపించింది. మొత్తం 15 డివిజన్ల పరిధిలోని 53 కాలనీల్లోని సుమారు 11వేల కుటుంబాలు నీళ్లలోనే చిక్కుకుపోయాయి.

తక్షణ స్పందనతో ఊరట

ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్ రాజాబాబు, కమిషనర్ వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత తక్షణం స్పందించి చర్యలు చేపట్టడంతో నగర ప్రజానీకం కొంతఊరట చెందారు. 7వేల మందికిపైగా ప్రజలను పునరావాస కేంద్రాలకు చేర్చి సహాయక కార్యక్రమాలు చేపట్టారు. గురువారం కూడా పలు కాలనీల్లో నీరు బురద ఉండటంతో కార్పొరేషన్ అధికారులు వాటి తొలగింపు చర్యలు చేపట్టారు. నిజానికి ఈ స్థాయిలో వర్షం, ఆపై ఎగువ నుంచి వరదలు వస్తే గతంలో పరిస్థితుల ప్రకారం నగరంలో వారంరోజుల పాటు జనజీవనం స్తంభించి పోయేది. లైలా తుఫాన్ వచ్చినప్పుడు 24 గంటల్లో 22సెం.మీ. వర్షం పడగా వారం రోజులు నగరం అల్లకల్లోలమైంది. దామచర్ల జనార్దన్ ప్రణాళికాబద్ధంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల మెరుగునకు తీసుకున్న చర్యలతో ఎంత వర్షం కురిసినా వెలిసిన ఒకటి, రెండు గంటల్లోనే ప్రధాన వీధులు పరిశుభ్రం అవుతున్నాయి. దాని వల్లనే మొంథా తుఫాన్ వల్ల ఏకంగా 25.72 సెం.మీ. వర్షం కురిసినా వాగుల నుంచి భారీ వరద నీరు వచ్చినా ఒక్కరోజు వ్యవధిలో సాధారణ పరిస్థితి నెలకొంది.

కొత్తపట్నం మండలంపై తీవ్ర ప్రభావం

ఒంగోలును ముంచెత్తిన వరద ఎఫెక్ట్ దిగువన ఉన్న కొత్తపట్నం మండలంపైనా తీవ్రంగా పడింది. పోతురాజు కాలువ, నల్లవాగులు పొంగడంతో నగరానికి తూర్పువైపు కొప్పోలు మీదుగా కొత్తపట్నం పోయే మార్గంలో గురువారం కూడా వరద పారింది. మరోవైపు సూరారెడ్డిపాలెం, ఈతముక్కల మార్గంలోనూ వాగులు పొంగాయి. రెండు మార్గాలకు సమీపంలో రొయ్యల చెరువులు అడ్డదిడ్డాలుగా తవ్వడం కూడా ముంపునకు కారణంగా కనిపిస్తోంది. ఏమైనా ఒంగోలు నగరాన్ని పోల్చితే కొత్తపట్నం మండలాన్ని మరింతగా తుఫాన్ దెబ్బతీయగా గురువారం కూడా ఒంగోలు నుంచి కొత్తపట్నం వెళ్ళేందుకు అవకాశం లేకుండాపోయింది.

● ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో గ్రామపంచాయతీలకు జరిగిన నష్టాలపై నివేదికలు పంపాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలు జారీచేయడంతో తదనుగుణంగా జిల్లాలో చర్యలు చేపట్టారు.

ప్రజలకు ఏ కష్టం వచ్చినా ముందుంటాం

అవీఇవీ

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ముంపు ప్రాంత ప్రజలకు నిత్యవసర సరుకుల పంపిణీ

గిద్దలూరు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాము ముందుండి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చెప్పారు. గురువారం పట్టణంలోని 17వ వార్డు సారంగపాణి వీధికి చెందిన పునరావాస బాధితులకు ఆయన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25కిలోల బియ్యం, కిలో చక్కెర, కిలో కందిపప్పు, కిలో ఉల్లిపాయలు, వంటనూనె, కిలో బంగాళదుంపలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో తుఫాన్ ప్రభావంతో చెరువులు, వాగులు, వరదలతో నిండాయన్నారు. పట్టణంలోని ముంపు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి అక్కడ అన్ని వసతులు కల్పించామని చెప్పారు. పునరావాస కేంద్రంలోని బాధితులకు ఒక్కొక్కరికి రూ.1000 అందజేస్తున్నామన్నారు. అధికార యంత్రాంగం బాగా పని చేశారని అభినందించారు. మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామనారాయణరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు శానేషావలి, టీడీపీ నాయకులు పిడతల రవితేజ, బొంతా లక్ష్మీదేవి, దూదేకుల దస్తగిరి, మద్దులేటి, బొర్రా రాఘవేంద్రయాదవ్, దూదేకుల ఫాతిమా పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకి మొంథా దెబ్బ



బురద దారిలో శ్మశానానికి శవాన్ని మోసుకెళ్తున్న ప్రజలు

పెద్ద దోర్నాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్‌తో తాకిడికి మండలం అతలాకుతలమైంది. ఎక్కడ చూసిన వరద, బురదమయంగా మారింది. ఆఖరి మజిలీకి కూడా తుఫాన్ అవస్థలు తప్పలేదు. మండలంలోని ఐనముక్కుల గ్రామంలో మృతదేహాన్ని శ్మశానానికి తరలించేందుకు బంధువులు బురదలో నానాఅగచాట్లు పడ్డారు. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని కోరుతున్నారు.

గుండ్లకమ్మ ఉగ్రరూపం

(5వ పేజీ తరువాయి)

నుంచి వర్షపునీరు, త్రిపురాంతకం ప్రాంతం నుంచి సాగర్ కాలువ నీరు వస్తుంటుంది. మార్గమధ్యలో పలు వాగులు, వంకలు కలుస్తుంటాయి. డెడ్ స్టోరేజీపోనూ ఆరుసార్లు డ్యామ్ నిండితే 12.50 టీఎంసీల నీటితో మద్దిపాడు, ఒంగోలు రూరల్, ఎన్‌జిపాడు మండలాల్లో 80,060 ఎకరాలకు నీరు ఇచ్చేలా నిర్మాణం చేశారు. డ్యామ్‌కు 15 గేట్లు ఉండగా వాటి ద్వారా గరిష్ఠంగా 2.72 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలే విధంగా డిజైన్ చేశారు. అయితే ప్రాజెక్టు ప్రారంభించాక ఇంత వరకు లక్ష క్యూసెక్కుల వరద కూడా వచ్చిన సందర్భం లేకపోగా ప్రస్తుతం వచ్చిన మొంథా తుఫాన్‌తో ఊహించని రీతిలో వరద పోటెత్తింది. తుఫాన్ కన్నా ముందు నాలుగు రోజులు విస్తారంగా జిల్లాలో వర్షాలు కురియగా గుండ్లకమ్మకు భారీగానే నీరు వచ్చింది. రిజర్వాయర్ కెపాసిటీ 3.89 టీఎంసీలు కాగా 3.30 టీఎంసీల వరకు నిల్వ ఉంచి మిగిలిన నీరు దిగువకు వదిలారు. అయితే మొంథా తుఫాన్‌తో ఒక్కసారిగా వరద పెరిగింది. పశ్చిమ ప్రాంతంలోనూ, నల్లమల అటవీ ప్రాంతంలోనూ భారీగా వర్షం పడి వాగులు, వంకలు పొంగడంతో మంగళవారం సాయంత్రం నుంచి గుండ్లకమ్మకు వరద పెరిగింది. అలా బుధవారం ఉదయానికి 97 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. సాయంత్రానికి లక్షన్నర క్యూసెక్కులకు పెరిగింది. దీంతో 14 గేట్లు ఎత్తి లక్షా 31వేలు దిగువకు వదిలారు. గురువారం సాయంత్రానికి 98వేల క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా పది గేట్లు ఎత్తి 80వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అలా 24 గంటల వ్యవధిలో సగటున లక్ష నుంచి లక్షా 10వేల క్యూసెక్కుల వంతున మొంథా తుఫాన్ ప్రభావంతో వచ్చిన 7 టీఎంసీల నీటిని ప్రాజెక్టు నుంచి దిగువకు వదిలారు. అలా మూడు, నాలుగు రోజుల్లో 9 టీఎంసీల వరద నీటిని ప్రాజెక్టు నుంచి వదలడం అందులోనూ బుధవారం రాత్రంతా లక్ష క్యూసెక్కులకుపైగా విడుదలతో దిగువనున్న అనేక గ్రామాలు జలమయం అయ్యాయి నదికి ఇరువైపుల మద్దిపాడు, ఎన్‌జిపాడు, ఒంగోలు రూరల్ మండలాల్లో 25 గ్రామాలు ఉండగా ఇంచుమించు అన్ని గ్రామాలు ఏదో ఒక స్థాయిలో గుండ్లకమ్మ ఉగ్రరూపంతో ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. నదికి సమీపంలోని మల్లవరం, కోలచనకోట, వెల్లంపల్లి గ్రామాల వద్ద ఇరువైపులా నది పరిధి దాటి ప్రవహించింది. దక్షిణం వైపున ఉన్న వెల్లంపల్లి- తాళ్లూరు రోడ్డుపైకి వరదనీరు రావడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. గుండ్లాపల్లి వైపు ఉన్న పైపుల కంపెనీని వరద ముంచెత్తింది. ఇక చీరాల జాతీయ రహదారిపై ఉన్న మద్దిరాలపాడును గుండ్లకమ్మ నీరు ముంచెత్తింది. దీంతో బుధవారం సాయంత్రం నుంచి ఒంగోలు-చీరాల మధ్యలో రాకపోకలు నిలిచిపోగా ఒంగోలు రూరల్ మండలంలోని కరవది, ఉలిచి ప్రాంతాల్లో గుండ్లకమ్మ నీరు గ్రామాల రోడ్లపైకి రావడంతో త్రోవగుంట- ఉలిచి మార్గంలో రవాణా ఆగింది. కరవది చుట్టూ గుండ్లకమ్మ నీరు చేరి కొప్పోలు, చేజర్ల వెళ్ళే మార్గాలు, రైల్వేట్రాక్ ప్రాంతం జలదిగ్బంధమైంది. ఇనమనమెళ్ళూరు, దేశినేనిపాలెం, చదలవాడ, నందిపాడు పలు ఇతర గ్రామాలు పాక్షికంగా జలమయంకాగా ఉప్పలపాడు పంచాయతీలోని ఏటిఒడ్డు ఉప్పలపాడులోని 15 కుటుంబాలకు చెందిన 50 మంది జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. బుధవారం రాత్రంతా మేడలు ఎక్కి వారు రక్షణ పొందగా గురువారం సాయంత్రానికి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పడవల్లో వారికి ఆహారం, నీరు అందించాయి. అమ్మనబ్రోలు, వినోదరాయునిపాలెం, చేకూరపాడు, కనపర్తి తదితర గ్రామాల్లోనూ గుండ్లకమ్మ నీరు పంట పొలాలను ముంచెత్తింది. ప్రాజెక్టు ప్రారంభించాక ఈస్థాయిలో వరదరావడం ఇదే ప్రథమం కావడం దిగువ గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే గురువారం సాయంత్రానికి కొద్దిగా వరద తగ్గడంతో ఇటు అధికారులు, అటు ప్రజానీకం కాస్తంత ఊపిరిపీల్చుకోగా ఇంకా దాదాపు 90వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.


కంభం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గుండకమ్మ పాయ

కంభంలో పొంగిన గుండ్లకమ్మ

● 150ఎకరాలకు పైగా మునిగిన అరటి తోటలు


వరదలకు నీటమునిగిన అరటి తోటలు

కంభం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో గతంలో ఎన్నడూ లేని విధంగా కంభం, అర్ధవీడు మండలాలలో పలు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పలు పంటలు నీట మునిగాయి. అయితే 5సంవత్సరాల తర్వాత చారిత్రాత్మక కంభం చెరువు నుంచి 4అడుగులకు పైగా అలుగు పారుతుండడంతో ఆ నీరంతా బుధవారం రాత్రి కంభం పట్టణంలోని గుండకమ్మలోకి వస్తోంది. దీంతో 30 ఏళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా మహోగ్రంగా ప్రవహిస్తూ పరీవాహక ప్రాంతంలోని 150 ఎకరాల్లోని అరటి తోటలను ముంచెత్తింది. పైగా కంభం చెరువుకు వెళ్లే దారికి ఇరువైపులా మరో 400 ఎకరాలకు పైగా అరటి తోటలు ఉండడంతో ఆ తోటల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకుందామనుకున్న రైతులకు రోడ్డు మధ్యలో గుండ్లకమ్మ ప్రవహిస్తుండడంతో పోలీసులు ఆ వాగు దాటి వెళ్లేందుకు అనుమతించడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం అరటి చెట్లు గెలలకు వచ్చాయని, వరదనీరు తోటలలో నిలబడితే చెట్లు గెలలతో సహా కూలిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రానైట్‌పై 'మొంథా' ఎఫెక్ట్

● జలపాతాలను తలపిస్తున్న క్వారీలు
● ఉత్పత్తి ప్రక్రియకు విఘాతం


జలపాతాలను తలపిస్తున్న గెలాక్సీ గ్రానైట్ క్వారీలు

చీమకుర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమపై మొంథా తుఫాన్ ప్రభావం పడింది. పదిహేను రోజులుగా ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తుండటం, దీనికితోడు తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో క్వారీల్లో ఉత్పత్తి ప్రక్రియకు విఘాతం కలిగింది. క్వారీలు జలపాతాలను తలపిస్తున్నాయి. క్వారీ పిట్‌లలో వర్షపు నీరు నిండిపోయి రాయి వెలికితీసే ప్రక్రియకు బ్రేక్ పడింది. భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు అన్ని క్వారీల్లో ఉత్పత్తి ప్రక్రియ నిలిచిపోయింది. క్వారీ గుంతల్లో నిండిపోయిన వర్షపు నీటిని బయటకు పంపటం అనేది ఓనర్లకు పెద్ద ప్రహసనంగా మారింది. ఉత్పత్తి ఖర్చు పెరగనుంది. అంతేగాక క్వారీల్లో తిరిగి కార్యకలాపాలు మొదలవటానికి కొన్నిరోజులు పట్టే అవకాశం ఉంది.


దెబ్బతిన్న మొక్క జొన్న పైరును పరిశీలిస్తున్న టీడీపీ దర్శి ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, తదితరులు

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ముండ్లమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం ముండ్లమూరులో దెబ్బతిన్న మొక్క జొన్న, మిరప తోటలను పరిశీలించారు. నష్టపోయిన రైతుల వివరాలను నమోదుచేయాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఏవో తిరుమల రావును ఆదేశించారు. ముండ్లమూరు మండలంలో ఏడువేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా 1,250 ఎకరాల్లో నష్టం జరిగిందని వ్యవసాయ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక అందించారన్నారు. లోతట్టు ప్రాంతాలైన మారెళ్ళ, ముండ్లమూరు, ఉల్లగల్లు గ్రామాల్లో నివశిస్తున్న వారిని స్థానిక ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రానికి తరలించినట్టు చెప్పారు. వారికి ప్రభుత్వం అన్నిసౌకర్యాలు ఏర్పాటు చేసిందన్నారు. ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్ళే చిలకలేరు వాగుపై దెబ్బతిన్న బ్రిడ్జిని, ఉమామహేశ్వర అగ్రహారం నుంచి చింతలపూడి వెళ్ళే ఆర్‌అండ్‌బీ రోడ్డు భారీ వ ర్షానికి కోసుకుపోగా ఆ రహదారిని డాక్టర్ లక్ష్మీ పరిశీలించారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి మునిసిపల్ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విపత్తు సమయంలో ప్రజలకు అండగా నిలిచాం

మంత్రి స్వామి
తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో పర్యటన
కాలనీల వాసులకు భరోసా
కారుమంచి- మర్లపాడు రోడ్డు మరమ్మతులకు ఆదేశం

టంగుటూరు (కొండపి), అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ముందు చూపుతో తుఫాన్ నష్టాన్ని నివారించగలిగామని, అధికార యంత్రాంగం అప్రమత్తతతో ముప్పును సమర్థంగా ఎదుర్కొన్నామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి మంత్రి పర్యటించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సమర్థుడైన నాయకుడు అయినందు వల్లనే తుఫాన్ నష్టాల నుంచి తప్పించుకోగలిగామన్నారు. ప్రధానంగా ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించామన్నారు. కూటమి క్యాడర్ ప్రభుత్వానికి అండగా నిలిచి విపత్తు నుంచి ప్రజలకు రక్షణ కల్పించిందన్నారు. ఈసందర్భంగా మల్లవరప్పాడు- కారుమంచి గ్రామాల మధ్యన వరద నీటి కారణంగా దెబ్బతిన్న రోడ్డును మంత్రి పరిశీలించారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆలకూరపాడు పునరావాస కేంద్రంలో ఉన్న వారితో స్వామి మాట్లాడారు. అధికారులు కల్పించిన వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతవరం గ్రామంలో నీట మునిగిన ఎస్టీ కాలనీ వాసులను పరామర్శించారు. కాలనీలోని నీటిని వెలుపలకు పంపే చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఆంజనేయులు, ఎస్సై నాగమల్లేశ్వరరావు, నాయకులు ఈదర ప్రభాకర్ పాల్గొన్నారు.


అనంతవరంలో నీట మునిగిన ఎస్టీ కాలనీ మహిళతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

పొంగుతున్న ముసి, పాలేరు వాగులు

పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
20 ఏళ్లలో ఇంత ఉధృతి చూడలేదంటున్న ప్రజలు

జరుగుమల్లి (కొండపి), అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): ఉగ్రరూపం దాల్చిన ముసి పాలేటిపాడు వద్ద, జయవరం వద్ద నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు దాటుకుని జరుగుమల్లి మండలంలోని వావిలేటిపాడువైపు ప్రవహిస్తున్నది. అక్కడ నుంచి పాలేరులోకి వెళ్తున్నది. దీంతో బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు పాలేటిపాడు నుంచి టంగుటూరు వరకు, వావిలేటిపాడు అడ్డరోడ్డు నుంచి దాదాపు జరుగుమల్లి వరకు మధ్యలోని పొలాలు, వాగులు నీటితో నిండి ప్రవహించాయి. ఒకదశలో వావిలేటిపాడు అడ్డరోడ్డు వరకు ఏరును తలపించింది. ఈ కారణంగా జాతీయ రహదారికి పడమరవైపు గ్రామాల్లోకి నీరు చేరింది. టంగుటూరులోని మండల కార్యాలయాల పరిసరాలు కూడా నీటితో నిండాయి. దీంతో ఈరెండు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వాహనాలు గురువారం సాయంత్రం వరకు రాకపోకలు సాగించలేదు. చాలామంది సింగరాయకొండ, ఒంగోలుకు కె. ఉప్పలపాడు నుంచి చిర్రికూరపాడు మీదుగా కందుకూరు చేరి అక్కడ నుంచి సింగరాయకొండకు, ఒంగోలుకు ప్రయాణాలు సాగించారు. కె.ఉప్పలపాడు గ్రామం దాటిన తర్వాత నుంచి తూమాడు, పాలేటిపాడు, జయవరం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రెండు నుంచి 300 మీటర్ల దూరంలో ముసి పొలాల నుంచి ప్రవహించింది. ఇంతలా 20 ఏళ్లలో రోడ్డుపై నుంచి మూడు రోజులు తరబడి ప్రవహించడం ఇపుడే చూస్తున్నామని పాలేటిపాడు గ్రామానికి చెందిన వృద్ధులు తెలిపారు. పాలేటిపాడు గ్రామం వద్ద వాహనాల రాకపోకలు సాగకుండా సచివాలయ సిబ్బంది పాలేటిపాడువైపు, సాధువారిపాలెంవైపు కాపలా కాస్తున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మక్కెన శ్రీనివాసులు కూడా గ్రామ యువకుల సాయంతో పాలేటిపాడు వద్ద కాపలా ఉంటూ రాకపోకలు సాగించకుండా వాహనదారులకు మూడు రోజులుగా అవగాహన కలిగిస్తున్నారు.


పాలేటిపాడు వద్ద గ్రామాన్ని అనుకుని ప్రవహిస్తున్న ముసి (ఇన్‌సెట్లో) వావిలేటిపాడు వద్ద భారీగా చేరిన నీరు

బాధిత కుటుంబాలకు సాయం

● నిత్యావసర సరుకుల పంపిణీకి శ్రీకారం
● జిల్లా వ్యాప్తంగా 7,825 కుటుంబాలకు చేయూత


చెర్వుకొమ్ముపాలెంలో బాధిత కుటుంబాలకు సరుకులు పంపిణీ చేస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్దన్, ఎండీ ఢిల్లీరావు, జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచింది.ఒక వైపు సహాయక కార్యక్రమాలు కొనసాగుతుండగానే మరో వైపు జిల్లా వ్యాప్తంగా బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. భారీ వర్షాలతో తీవ్రంగానష్టపోయిన బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, పంచదార, అయిల్, కందిపప్పు, బంగాళాదుంపలు కిలో వంతున పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మత్స్యకార కుటుంబాలకు మాత్రం 50కిలోల బియ్యంపంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదనుగుణంగా జిల్లా వ్యాప్తంగా ముందుగా గుర్తించిన బాధిత కుటుంబాలకు ఈ సరుకులను పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా పునరావాస కేంద్రాల్లో ఉన్న 1,803 కుటుంబాలు, 5,844 మత్స్యకార కుటుంబాలు, 178 చేనేతల కుటుంబాలు కలిపి సుమారు 7,825 కుటుంబాలకు గురువారం నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారీ వర్షాలతో ముంపు కారణంగా ఇంకా తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలను గుర్తించి తహసీల్దార్ల నుంచి నివేదికలు వచ్చిన వెంటనే కలెక్టర్ పీ రాజాబాబు అనుమతితో ఆ కుటుంబాలకు కూడా నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కాగా గురువారంసాయంత్రం ఒంగోలు కార్పొరేషన్‌పరిధిలోని చెర్వుకొమ్ముపాలెంలో బాధిత కుటుంబాలకు సాంఘికసంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి,సివిల్ సప్లయిస్ ఎండీ ఢిల్లీరావు, ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఎస్‌వో పద్మశ్రీలు తదితరులు ఉన్నారు.

మిరప రైతు కుదేలు

మార్కాపురం డివిజన్‌లో 4వేల ఎకరాల్లో దెబ్బతిన్న పైరు


బొందలపాడులో గుండ్లకమ్మ ఉధృతితో మూడు రోజులుగా నీటిలోనే ఉన్న మిరప చేను

మార్కాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వాణిజ్య పంటల్లో ప్రధానమైన మిరప రైతును మొంథా తుఫాన్ నిండా ముంచింది. గత రెండేళ్లుగా ధరలు లేక మిరప సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సంవత్సరం తుఫానుతో కుదేలయ్యారు. పది రోజుల కిందట అల్పపీడనాల ప్రభావంతో కొంతమేర పంట దెబ్బతింది. ఆ వర్షాల నుంచి తేరుకునేలోపే మళ్లీ తుఫాన్ విపత్తు వారిపై పిడుగులా విరుచుకుపడింది. జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో మిరప సాగవుతోంది మార్కాపురం డివిజన్‌లోనే. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో సాగు చేసిన మిరప పంట ప్రస్తుతం కాయతో ఉంది. రబీలో ఈ మధ్యనే కొంతమేర మాత్రమే సాగు చేశారు. కాయతో ఉన్న మిరప తోటల్లో నీరుచేరి రోజులపాటు ఉండడంతో రైతులకు దిగుబడి చేతికి దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఇదిలా ఉంటే ఉద్యాన అధికారులు ప్రస్తుతం కొంత మేర మాత్రమే పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు వేస్తున్నారు. కొన్నిచోట్ల పంటలను కూడా ఇంకా పూర్తిస్థాయిలో పరిశీలించలేదు. పూర్తి స్థాయిలో గ్రామాల్లో మిరపను పరిశీలిస్తేనే నష్ట తీవ్రత తెలిసే అవకాశం ఉంది. ప్రస్తుతం వర్షాల తీవ్రతనుబట్టి చూస్తే డివిజన్‌వ్యాప్తంగా 40 శాతం మేర అంటే 4వేల ఎకరాల వరకు పంట దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వం ఆదుకుంటేనే..

మార్కాపురం డివిజన్‌లో ఈ సంవత్సరం ఖరీఫ్‌లో 10వేల ఎకరాల మేర మిర్చి సాగు చేశారు. రబీలో కొద్దిమేర మాత్రమే సాగైంది. జూలై, ఆగస్టులో నాటిన మిరప తోటలు ఈ సంవత్సరం కొంతమేర తెగుళ్లు తక్కువగా ఉండడంతో కళకళలాడుతున్నాయి. మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఏర్పడింది. కానీ అక్టోబరులో గతంలో ఎన్నడూలేని వి. దంగా వరుసగా అల్పపీడనాలు, మొంథా తుఫాన్ విరుచుకుపడటంతో పంట దెబ్బతింది. ప్రస్తుతం ప్రభుత్వం నష్ట పరిహారం అందజేసి ఆదుకోకపోతే కోలుకోవడం కష్టమేనని మిరప రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా యంత్రాంగం కృషి అభినందనీయం

● 20సూత్రాల అమలు కమిటీ చైర్మన్ దినకర్


మాట్లాడుతున్న లంకా దినకర్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :మొంథా తుఫాన్‌నష్ట తీవ్రతను తగ్గించేందుకు జిల్లా యంత్రాంగం చేసిన కృషి, చేపట్టిన చర్యలు అభినందనీయమని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోలు రూమును గురువారం ఆయన సందర్శించి క్షేత్ర స్థాయిలో చేపడుతున్న సహాయక చర్యలు, జరిగిన నష్టాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు ఈ సందర్భంగా చైర్మన్ దినకర్‌కు వివరించారు. అనంతరం అ క్కడవిలేఖరుల సమావేశంలో దినకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ముందస్తు చర్యలవల్ల నష్టనివారణ తగ్గిందన్నారు. జిల్లా యంత్రాంగం స్ఫూర్తిదాయకంగా పనిచేయడంతో జిల్లాలో ప్రాణ నష్టం జరగలేదన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

అంచనాలకు మించి పంట నష్టం

» ఆందోళనలో రైతులు

దర్శి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో పంటల నష్టం అంచనాలు మించి అధికంగా జరిగింది. పంట పొలాల్లో గురువారం కూడా నీరు అలాగే నిల్వ ఉంది. దీంతో పత్తి, మిర్చి, పొగాకు తదితర పంటలు ఉరకెత్తి దెబ్బతింటున్నాయి. మిర్చి తోటలు కాపు దశలో ఉన్నాయి. వర్షాలకు భూములు ఉరకెత్తి కాపుమీద ఉన్న తోట నేలకొరిగింది. పత్తి పంట తీసే దశలో రోజులు తరబడి వర్షం కురవటంతో పత్తిలోకి నీరుచేరి రంగు మారటంతో పాటు మొలకెత్తింది. పొగ తోటలు రంగు మారి మొక్కలు చనిపోతున్నాయి. బోర్ల కింద సాగు చేసిన వరి పంట గింజపోసుకునే దశలో ఉంది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి పూర్తిగా నేలకొరిగింది. దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాఅగచాట్లు పడుతున్నారు. పొలాల్లోకి చేరిన నీరును బయటకు వెల్లగొడుతున్నారు. నేలకొరిగిన వరి పంటను నెలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

పంటల నష్టంపై వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మండలంలో 827 హెక్టార్లల్లో పత్తి, 41 హెక్టార్లలో వరి, 68 ఎకరాల్లో సజ్జ దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. పొగ తోటలు దెబ్బతిన్నప్పటికీ నష్టాల అంచనాలోకి రాలేదు. టుబాకో బోర్డు అధికారులు, వ్యవసాయాధికారులు సమన్వయంతో ఈలెక్కలు తేల్చాల్సి ఉంది. పొగాకు కొట్టుడుకు రాకపోవటంతో నష్టం జరిగినట్లు టుబాకో బోర్డు అధికారులు లెక్కలోకి తీసుకోకపోవటంతో నష్టాల జాబితాలో చేరలేదు. వాస్తవంగా అధికారులు వేసిన అంచనాల కంటే ఇంకా అధికంగానే నష్టం వాటిల్లింది. పంట దశలో ఉన్న పైర్లను మాత్రమే లెక్కకట్టారు. లేతపొగాకు తోటలు, మిర్చి, కంది పైర్లు కూడా కొన్నిచోట్ల ఉరకెత్తి దెబ్బతిన్నాయి. ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.


భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తి


మిర్చి తోటలోకి చేరిన నీరు

నిండామునిగిన పత్తి రైతు

దొనకొండ : ముంథా తుఫాన్‌తో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికొచ్చిన పంట దెబ్బతింది. భారీవర్షాలకు పత్తి కాయలు తడిసి కుళ్లిపోయాయి. పగిలిన పత్తి రంగుమారింది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. భారీ వర్షాలకు ఎకరాకు క్వింటా దిగుబడి కూడా వచ్చేలా లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోది 2500 హెక్టార్లల్లో పత్తి సాగుచేశారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గిద్దలూరు సబ్‌జైలు తనిఖీ


సబ్‌జైలును తనిఖీ చేస్తున్న జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇబ్రహీం షరీఫ్

గిద్దలూరు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు సబ్‌జైలును గురువారం జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ షేక్ ఇబ్రహీం షరీఫ్ తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదీలను వారికి అందుతున్న సదుపాయాలు, వైద్యం గురించి తెలుసుకున్నారు.

ఆయన వెంట జూనియర్ సివిల్ న్యాయాధికారి ఏ ఓంకార్, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.భరత్‌చంద్ర, జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, లీగల్ ఎయిడ్ న్యాయవాది కె.రవిప్రకాశ్‌బాబు, పారాలీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

కోతకు గురైన బొల్లుపల్లి, కందుకూరు రోడ్డు

10 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

కంభం అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ దెబ్బకు అర్ధవీడులో జంపలేరు, ఇతర వాగులు ఉప్పొంగాయి. మండలంలోని పలు ప్రధాన రహదారులు, చప్టాలు పూర్తిగా కోతకు గురయ్యాయి. దీంతో మూడు రోజులుగా. మూడు రోజులుగా 10 గ్రామాలకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి.

మరమ్మతులు చేపట్టండి : ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వరద ఉధృతి తగ్గగానే దెబ్బతిన్న రోడ్లు, చప్టాలకు మరమ్మతు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన అర్ధవీడు మండలంలోని జంపలేరు వాగు ప్రవాహంతో తెగిపోయిన రోడ్లను పరిశీలించారు.

లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 20ఏళ్ల జైలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కొంకాల హర్షవర్ధన్ అలియాస్ హర్షకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ స్థానిక పోక్సోకోర్టు న్యాయమూర్తి కేశైలజ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. బాలిక నీరు తెచ్చేందుకు బోరు వద్దకు వెళ్లగా కొమరోలు మండలానికి చెందిన కొంకాల హర్షవర్ధన్ వెనుకగా వెళ్లి బలవతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈమేరకు 2023 మార్చి 3న బాధిత బాలిక కొమరోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కొమరోలు పోలీసులుకేసు నమోదు చేసి నిందితుడు హర్షను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారించిన న్యాయమూర్తి శైలజ నిందుతుడిపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ. 10 వేలు జరిమానా విధించారు. అలాగే బాధితురాలికు రెండు లక్షలు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని డీఎల్‌ఎస్ఏని ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తరుపున గొట్టిపాటి శ్రీనివాసరావు తమ వాదనలు వినిపించారు. ఈకేసులో శిక్ష పడేవిధంగా సాక్షాధారాలను కోర్టు ముందు ఉంచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ వి.హర్షవర్ధన రాజు అభినందించారు.

నగరంలో తుఫాన్ నష్టం రూ.19.915 కోట్లు

● ప్రభుత్వానికి నివేదిక పంపిన అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ముప్పు కారణంగా ఒంగోలు నగరంలో సుమారు రూ.10.7కోట్లు మేర నష్టం వాటిల్లినట్లు నగరపాలక సంస్థ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. రోడ్లు డ్యామేజ్ 26.5 కి.మీ నష్టం వాటిల్లగా అందుకు రూ.15.20కోట్లు అవసరం ఉన్నట్లు గుర్తించారు. అలాగే డ్రైయిన్‌లు 4.20 కి.మీ దెబ్బతినగా, అందుకోసం రూ.2.4కోట్లు, అలాగే 4 స్కూలు బిల్డింగ్స్ దెబ్బతినగా వాటి మరమ్మతులకు రూ.10లక్షలు, 320 వీధి దీపాలు పాడైపోగా, అందుకు రూ.20 లక్షలు, 12 కల్వర్ట్‌లు దెబ్బతినగా అందుకు రూ.71.5 లక్షలు అవసరంగా గుర్తించారు. ఇందుకు సంబంధించి రూ.19.915 కోట్లు అవసరంగా అంచనా నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు.

ఆటో డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆటో డ్రైవర్ నందిరెడ్డి ఓబులరెడ్డికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ఒంగోలులోని అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి రాజా వెంకటాద్రి గురువారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు పొదిలి మండలం ఆముదాలపల్లికి చెందిన మహిళ చీమకుర్తిలోని జవహర్ ఆసుపత్రిలో ఏఎన్ఎంగా పని చేస్తుంది. 2021 అక్టోబరు 29న ఆముదాలపల్లికి వెళ్లేందుకు ఆమె ఆటో ఎక్కింది. అయితే ఆటో డ్రైవర్ ఓబులరెడ్డి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించి లైగికవేధింపులకు పాల్పడాడు. అంతేగాకుండా ఆమె దళిత మహిళ కావడంతో చులకనభావనతో వేధింపులకు గురి చేశాడని బాధితురాలు పొదిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతి తమ వాదనలు వినిపించారు. సాక్షులను విచారించిన న్యాయాధికారి నిందితుడు ఓబులరెడ్డిపై నేరం రుజువుకావడంతో జైలుశిక్ష, జరిమానా విధించారు. కోర్టులో సమర్థవతంగా సాక్ష్యాలను ప్రవేశపెట్టిన పోలీసులను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించిన డీఎస్పీ

మద్దిపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను గురువారం ఒంగోలు డీఎస్పీ రావిపాటి శ్రీనివాసరావు సందర్శించారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటిని ప్రాజెక్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద పరిస్థితిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు, వంకలు నీటి ఉధృతిని బట్టి పోలీస్ యంత్రాంగం పహారా ఉంచాలని ఎస్ఐ వెంకటసైదులును ఆదేశించారు. ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

10గేట్ల ద్వారా నీరు విడుదల

గుండ్లకమ్మ రిజర్వాయర్‌లోకి గురువారం 98 వేల క్యూసెక్కులు నీరు చేరగా 80 వేల క్యూసెక్కులు 10 గేట్ల ద్వారా బయటకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ రామాంజనేయులు తెలిపారు. 23.3 మీటర్ల వద్ద నీటిని స్థిరీకరణ చేసినట్లు చెప్పారు. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

ఎడమ కాలువ గండి..పొలాల్లోకి నీళ్లు..



కాలువకు పడిన గండి

తుఫాన్ ప్రభావం వల్ల గుండ్లాపల్లి సమీపంలోని గుండ్లకమ్మ ఎడమ కాలువకు గండి పడింది. దీంతో కాలువలో నీళ్లన్నీ పొలాల్లోకి వెళ్లడంతో మునిగిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు 20 ఎకరాల్లో మినుము పంట దెబ్బతిన్నది. గుండ్లాపల్లి శిద్దా రాఘవరావు ఫ్యాక్టరీ ముందు భాగంలో ఉన్న ఎడమ కాలువ దాదాపు పెద్ద గొయ్యి పడింది. రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దాదాపు 80 వేల క్యూసెక్కులు నీరు చేలలో పడి పంట నష్టం వాటిల్లింది.

మెరుగైన వైద్యసేవలు అందించాలి : డీఎంహెచ్‌వో

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం నగరంలోని కరుణాకాలనీ, బిలాల్‌నగర్, మదర్‌థెరిస్సాకాలనీ, పాపాకాలనీ, భగతసింగ్ కాలనీ, ప్రగతికాలనీ తదితర ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాలను సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాల వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అవసరమైన మందులు అందించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమలో మాస్‌మీడియా అధికారి నరసింహారావు, హెల్త్ అసిస్టెంట్ బ్రహ్మయ్య, ఎస్‌కే.మస్తాన్‌బీ, కవిత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


బాతుల పెంపకందార్లను ఆదుకోవాలి

సంతనూతలపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డొంకసమీపంలో తుఫాన్ తీవ్రతకు చెరువు అలుగు ప్రవాహానికి కొట్టుకుపోయి మృత్యువాతపడిన బాతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి బాధితులను ఆదుకోవాలని ఎరుకల హక్కుల పోరాటసమితి, ప్రజాసంఘాల నాయకులు కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధితులతో కలిసి ఆర్ఐ తేజకు వినతిపత్రం అందజేశారు. ఎరుకల హక్కుల పోరాటసమితి ఉపాధ్యక్షుడు పేరం శ్రీను, దళితసేవా ఫౌండేషన్ ఫౌండర్ యలమందబాబు, ఏకలవ్య యూత్ అధ్యక్షులు పి.శ్రీకాంత్, వైహెచ్‌పీఎస్ నాయకులు పి.తిరుమల, సౌరయ్య, దుర్గారావు పాల్గొన్నారు. అంతకుముందు సంతనూతలపాడు, పేర్నమిట్టకు చెందిన పశువైద్యులు అనురాధ, చిరంజీవి మృత్యువాతపడిన బాతులకు పంచనామా నిర్వహించారు.

మద్దులూరు-మాచవరం రోడ్డు ధ్వంసం

సంతనూతలపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దులూరు- మాచవరం గ్రామాల మధ్యన మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ఆర్అండ్‌బీ రోడ్డును మండల ప్రత్యేకాధికారి పి.శ్రీహరి, ఎంపీడీవో డి.సురేష్‌బాబు గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు నువ్వుల మీరయ్య, శ్రీనివాసరావు, కొండలరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా బీజేపీ



సరుకులను పంపిణీ చేసేందుకు వెళ్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ఒంగోలు నగరాన్ని ముంచెత్తడంతో బాధితులకు అండగా నిలిచారు బీజేపీ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి. నగరంలోని పలు కాలనీల్లో పర్యటించారు. డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి వికసిత్ భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు పాలప్యాకెట్లు, మంచినీరు, ఆహారాన్ని అందించారు చంటిపిల్లలతో ఇబ్బందులు పడుతున్న వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు, నాయకులు బొద్దులూరి ఆంజనేయులు, పీవీ.కృష్ణారెడ్డి, అమరసింహం, రాజేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ముందుచూపుతో ముప్పును ఎదుర్కొన్నాం

● అధికారులు, పార్టీ శ్రేణుల సమష్టి కృషి అభినందనీయం

● మీడియా సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒడా చైర్మన్ రియాజ్, మేయర్ సుజాత

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా ముప్పుపై ముందస్తు హెచ్చరికలు నేపథ్యంలో అధికారులు, పార్టీ శ్రేణులు అప్రమత్తమై సమర్థవంతంగా ఎదుర్కోగలిగామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. గురువారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27,28 తేదీలలో మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలోనే అత్యధికంగా ఒంగోలు నగరంలో 25.72 సెం.మీ వర్షం కురిసిందని, అయినా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా కాపాడామని తెలిపారు. 2010లో లైలా తుఫాన్‌కు మించి అత్యధికంగా వర్షం కురిసిందన్నారు. అయితే ప్రత్యేకించి మంగళవారం కురిసిన భారీ వర్షానికి నగరం జలమయం కాగా, శివారుకాలనీల్లో నీరు చేరి, అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడినట్లు గుర్తించామన్నారు. అయితే తాను స్వయంగా ఎస్పీ, కలెక్టర్, కమిషనరు, తహసీల్దారు ఇతర అధికారులతో కలిసి నగరంలో పర్యటించి ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుని ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రజలకు అండగా నిలిచినట్లు తెలిపారు. కేవలం లోతట్టు ప్రాంతాల్లోనే నీరు నిలిచిందని అన్నారు. ఆరు నెలల క్రితం పోతురాజు కాలువలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ చేయడం ద్వారా 90 శాతం ముప్పును తప్పించామన్నారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రికి భోజనం 7,375 మందికి అందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకున్నారని వివరించారు. కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తున్నారని, వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. త్వరలోనే పోతురాజు కాలువ పూర్తి స్థాయిలో ఆధునికీకరణ, నల్లకాలువ పనులు చేపడతామని వివరించారు. సమావేశంలో ఒడా చైర్మన్ షేక్ రియాజ్, మేయర్ సుజాత, ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు, డిప్యూటీ మేయర్ బుజ్జి పాల్గొన్నారు.

ఆక్వా నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతా..

కొత్తపట్నం: తుఫాన్ కారణంగా రొయ్యల రైతులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిహారం అందేలా చూస్తానని ఎమ్మెల్యే దామచర్ల పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని అల్లూరు, కొత్తపట్నం, పాదర్తి, మోటుమాల, గుండమాల గ్రామాల్లో ఆయన పర్యటించారు. అల్లూరు-కొత్తపట్నం మధ్యలో ఉన్న బకింగ్ కెనాల్ వద్ద ఆక్వా రైతులు తమ గోడు విన్నవించుకున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో వరదకు రొయ్యలు కొట్టుకుపోయాయని, తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం కొత్తపట్నం గంగమ్మ గుడి కాలనీ వాసులు ఎమ్మెల్యేకు తమ సమస్యలను చెప్పుకున్నారు. ఆయన వెంట ఒడా చైర్మన్ రియాజ్, టీడీపీ మండల అధ్యక్షుడు ద్వారగాపుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు అండగా ప్రభుత్వం

● మంత్రి స్వామి

● నిత్యావసర సరుకుల పంపిణీ

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావ పరిస్థితుల నుంచి బాధితులు పూర్తిగా కోలుకుని సాధారణ జీవితాన్ని కొనసాగించేలా అవసరమైన అన్ని చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. గురువారం ఒంగోలు నగరం చెరువుకొమ్ముపాలెంలో ముంపునకు గురైన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలను మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. డీఎస్‌వో పద్మశ్రీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. తుఫాన్‌నుకు ముందు నుంచే భారీ వర్షాలు కురుస్తాయని సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రులు లోకేష్, వి.అనిత, ఇతర ఉన్నతాధికారులు గుర్తించి ఎప్పటికపుడు జిల్లా అధికారులతో సమీక్షించారన్నారు. దీంతో వారు అప్రమత్తమై ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల ముంపు తప్పిందని వివరించారు. ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ తుఫాన్ ముప్పు తొలగడంతో ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించడంతోపాటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం పనులు ముమ్మరం చేసినట్లు తెలిపారు. అలాగే ఇళ్ళలో పేరుకుపోయిన నీటిని బయటకు తరలించడం, అలాగే వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పౌర సరఫరాల శాఖ ఎండీ ఢిల్లీరావు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత ప్రాంత ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి నెలా రెగ్యులర్‌గా ఇచ్చే సరుకులతో పాటు అదనంగా బాధితులకు బియ్యం, సరుకులు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, తహసీల్దార్ మధు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం.. : ఎమ్మెల్యే బీఎన్



దుప్పట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు అండగా ఉంటాం.. అధైర్యపడొద్దంటూ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ భరోసా ఇచ్చారు. గురువారం పేర్నమిట్ట పరిధిలోని 43వ డివిజన్‌లోని క్విస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రంలో ఉన్న నిర్వాసితులకు ఎమ్మెల్యే భోజనాలను అందించారు. అనంతరం 39వ డివిజన్ ఎస్టీకాలనీలో పర్యటించారు. పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండి బ్లీచింగ్ చల్లించాలని, ఫాగింగ్ చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణరెడ్డి, జనసేన సమన్వయకర్త కందుకూరిబాబు, టీడీపీ నాయకురాలు ఆరికట్ల సుమతి, కార్పొరేటర్లు మలగా రమేష్, నూకతోటి మస్తానమ్మ, వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, కరిచేటి శ్రీనివాసరావు, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

- సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లోని పునరావాస కేంద్రంలో ఉన్న 43 కుటుంబాల నిర్వాసితులకు టీడీపీ నేత కుంచాల రాజు స్వచ్ఛందంగా అందజేసిన నిత్యావసర వస్తువులు, దుప్పట్లను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ చేతుల మీదుగా అందజేసారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పి.శ్రీహరి, నాయకులు బి.చలపతిరావు, ఎం.లక్ష్మీనారాయణ, రాజేష్, శ్రీను, చిరంజీవి, ఎం.శ్రీనివాసరావు, ఆర్.అంకారావు, టి.శ్రీను పాల్గొన్నారు.

గుండ్లాపల్లిలో..

మద్దిపాడు: గుండ్లాపల్లిలోని పునరావాస కేంద్రాన్ని 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్‌తో కలిసి ఎమ్మెల్యే బీఎన్ సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర పొగాకు సమాఖ్య చైర్మన్ మండవ జయంత్‌బాబు, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, తుమ్మల సుధాకర్, దేవబత్తిన ప్రసాదరావు, మండవ గోపీనాథ్, పోతినేని శ్రీనివాసరావు, రావి ఉమామహేశ్వరరావు, పోకూరి శ్రీనివాసరావు, గడ్డం రవి, ఎద్దు సురేష్, మురళి పాల్గొన్నారు.

శివారు కాలనీలు చక్కబడేలా..!

● అగ్నిమాపకశాఖ సహకారంతో కాలనీల్లో బురద తొలగింపు



వీధులను శుభ్రం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది, పరిశీలిస్తున్న కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా ముప్పుతో అల్లాడిన నగరంలోని శివారు కాలనీలను చక్కదిద్దే పనిలో కార్పొరేషన్ అధికారులు నిమగ్నం అయ్యారు. ఈ మేరకు గురువారం కమిషనర్ వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత, ఎంఈ ఐశయ్యతోపాటు, డీఎంహెచ్ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆయా కాలనీల్లో పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో పలు కాలనీల్లోని ఇళ్ళలోకి నీరు చేరగా అక్కడి వారిని పునరావాస కేంద్రాలకు తరలించి అక్కడే వారికి అన్ని వసతులు కల్పించారు. అయితే ఆయా ప్రాంతాల్లో జనం యథావిధిగా జీవనం సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఉండటంతో కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాలతో బురద తొలగింపు, అలాగే నిలిచిన నీటిని తొలగించే చర్యలు చేపట్టారు. అగ్నిమాపక శాఖ అధికారులు వీధులను, ఇళ్ళను ఫైర్ ఇంజన్లు ద్వారా శుభ్రం చేస్తున్నారు. మరోవైపు కార్పొరేషన్ పారిశుధ్యం, ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో కాలువల్లో పూడికతీత పనులు, అవసరమైన చోట్ల కల్వర్టుల తొలగింపు చేపట్టారు. కాగా చెరువుకొమ్ముపాలెం, వెంగముక్కలపాలెం, మదర్‌థెరిస్సా కాలనీ, ప్రగతి కాలనీ, అరవ కాలనీ, దత్తాత్రేయ కాలనీ, గుర్రం జాషువా కాలనీ, ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ గృహకల్ప, ఎన్టీఆర్ కాలనీ, గడ్డికయ్యలు, గోపాలనగరం ఆక్స్‌టెన్షన్, బాలినేని భరత్ కాలనీ, బలరాం కాలనీ, ఉదయం కాలనీ, పొనుగుపాటి కాలనీ, కేశవరాజు కుంట, పాపాకాలనీ, కరుణకాలనీ, బిలాల్‌నగర్, జయప్రకాష్ కాలనీ, సుబ్బయ్యకాలనీ, పీర్లమాన్యం, కొత్తడొంక, వడ్డెవానికుంట, ఎన్ అగ్రహారం, ఇస్లాంపేట, మారుతీనగర్, వీఎన్. కాలనీలు ముంపుకు గురయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాలలో పరిస్థితులను చక్కదిద్దే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో 23 కాలనీల వరకు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాగా, వారి కోసం ఏడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారు 1554 కుటుంబాలను తుఫాన్ ఇబ్బందులను ఎదుర్కొనగా, 7217 మంది ప్రజలను ఆయా కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. ప్రతి రోజు వారికి అవసరమైన ఆహారం, తాగునీరు, ఇతర సౌకర్యాలను అందించినట్లు తెలిపారు. కాగా గురువారం సాయంత్రానికి పునరావాస కేంద్రాల్లో తలదచుకున్న వారిని తిరిగి వారి ఇళ్ళకు చేరుస్తామన్నారు.

ముంచెత్తిన గుండ్లకమ్మ వరదనీరు

జలదిగ్బంధంలో పలు గ్రామాలు

రంగంలోకి ఎస్‌డీఆర్ఎఫ్ బృందం

ఆహారం, తాగునీరు, సరుకులు అందజేత



మద్దిరాలపాడులో పర్యటిస్తున్న అధికారులు



చిర్వానుప్పలపాడు రోడ్డులో సీఐ పరిశీలన

నాగులుప్పలపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానును ప్రభావంతో గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు భారీగా వస్తుండడంతో మండలంలోని పరివాహక గ్రామాలైన మద్దిరాలపాడు, చదలవాడ, ఏటిఒడ్డుఉప్పలపాడు, కేశినేనివారిపాలెం గ్రామాలను వరద ముంచెత్తింది. అమ్మనబ్రోలు ఎస్సీకాలనీలు, వినోదరాయునిపాలెం గ్రామాల్లోకి వరదనీరు చేరింది. దీంతో మద్దిరాలపాడు జలదిగ్బంధంలో చిక్కుకొంది. ఇనమనమెళ్లూరులోని 216 జాతీయ రహదారిపైకి పెద్దఎత్తున వరదనీరు చేరడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఏటిఒడ్డు ఉప్పలపాడు ఎస్సీకాలనీలో 16 కుటుంబాలకు చెందిన 56 మంది చిక్కుకు పోగా ఈ విషయం తెలుసుకొన్న ప్రత్యేకాధికారి జి.జోసెఫ్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్, రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు అక్కడకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో చేరుకుని ఆహారం, తాగునీరు, నిత్యావసర వస్తువులు తరలించి అందజేశారు. అమ్మనబ్రోలు ఎస్సీకాలనీలలోకి వరదనీరు చేరింది. కనపర్తి ఎత్తిపోతల పథకంలోకి వర్షపు నీరు చేరి పలుచోట్ల కాలువ కట్టలు తెగిపోయాయి. వినోదరాయునిపాలెంలోని విద్యుత్‌సబ్‌స్టేషన్, కనపర్తి రోడ్డుపైన, నివాసగృహాల్లోకి వరద చేరింది. చదలవాడ సచివాలయం, అంబేడ్కర్‌కాలనీలోకి వరదనీరు చేరడంతో కాలనీవాసులను చీర్వానుప్పలపాడు రోడ్డులోని ఎంపీపీ పాఠశాలకు తరలించి పునరావాసం కల్పించారు. కండ్లగుంటలో మున్నంగి సురేష్‌కు చెందిన పొగాకు బ్యారన్ కూలిపోయింది. పోతవరంనకు చెందిన పూనూరి కోటిరెడ్డికి చెందిన బ్యారన్ గోడ పడిపోయింది. ఎం.ముప్పాళ్లను వరదనీరు వీడలేదు. నాగులుప్పలపాడు, కనపర్తి, చదలవాడ, రాపర్ల గ్రామాల్లో పునరావాస కేంద్రాలు కొనసాగాయి. చీర్వానుప్పలపాడులోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టి పలు గ్రామాలకు విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు. మద్దిరాలపాడు, పలు గ్రామాలలో నిలిచిపోయిన విద్యుత్‌ను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాన్నారు.

పది గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

ఒంగోలు(రూరల్): గుండ్లకమ్మ నది గురువారం తెల్లవారుజాము నుంచి ఉధృతంగా ప్రవహించడంతో ఒంగోలు మండలంలోని పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కరవది రైల్వేగేట్‌కు పడమర వైపు నుంచి సుమారు కిలో మీటరు వరకు వరదనీరు ఆర్అండ్‌బీ రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తోంది. అదేవిధంగా కరవది-ఉలిచి వరకు గల రోడ్డులో ప్రవాహం కొనసాగుతున్నది. అలాగే బీవీపాలెం రోడ్డులో కూడా ఇదే పరిస్థితి. కరవది-చేజర్ల రోడ్డులో అంకమ్మగుడి దగ్గర వరద జోరుగా ప్రవహిస్తోంది. పానకాలపాలెం-చేజర్ల రోడ్డులో కూడా నీటి ప్రవాహం కొనసాగుతున్నది. చేజర్లను వరదనీరు చుట్టుముట్టడంతో 20 గృహాలలోకి నీరు చేరడంతో వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. కరవది ఎస్సీకాలనీలో వరద నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కరవది-బీవీపాలెం వరకు రోడ్డులో వరద నీటిలో ఉంది. జలదిగ్బంధంలో ఉన్న గ్రామాల ప్రజలు కాగా కరవదిలోకి వరద నీరు రావడంతో అక్కడి ప్రజలను ట్రాక్టర్‌ల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలించారు.

రహదార్లపై ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న వరద

కొత్తపట్నం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షానికి మండలంలో నష్టం అంచనాకు మించే జరిగింది. కొత్తపట్నం మండలం నుంచి ఒంగోలు తదితర ప్రాంతాలకు ఉన్న మూడు రోడ్డు మార్గాలు మూసుకుపోయాయి. ఈ మార్గాల్లో నిర్మించిన వంతెనలు సైతం నేడు పనికి రాకుండా పోయాయి. రోడ్డంతా నీరే చేరింది. ప్రమాదకర స్థాయిలో రోడ్లపై నీరు పారుతుండటంతో అధికారులు మూడు రోజులుగా రాకపోకలను నిలిపివేశారు. వందలాది రొయ్యల చెరువుల్లో ఉన్న రొయ్యలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. వందలాది ఎకరాల్లో సాగు చేసిన వరిపైరు మునిగిపోయింది. అల్లూరు మరో వారం రోజులు అయినా పంట కనిపించే పరిస్థితి లేదు.

నేడు ఒంగోలులో జాబ్‌మేళా

ఒంగోలు నగరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 31వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పానాధికారి కె.రమాదేవి తెలిపారు. స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఈ మేళా ప్రారంభమవుతుందన్నారు. టీవీఎస్ లూకాస్, టాటా ఎలక్ట్రానిక్స్, హెటిరో డ్రగ్స్, ఫ్లిప్‌కార్ట్, పేటీఎం, డి-మార్టు, బీఎఫ్ఐఎల్ ఇండస్ ఇండ్‌బ్యాంకులో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ఈ జాబ్‌మేళా జరుగుతుందని పేర్కొన్నారు. ఏదైనా విభాగంలో ఐటీఐ, డిప్లమో, టెన్త్, ఇంటర్, డిగ్రీ, చదువు పూర్తి చేసిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. వేతనం నెలకు రూ.14 వేల నుంచి రూ.23 వేల వరకు ఉంటుందని, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో అభ్యర్థులు హాజరుకావాలని కోరారు.

డైట్‌లో పోస్టుల దరఖాస్తుకు నేటితో ఆఖరు

సంతనూతలపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో 4 లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు గడువును ఈనెల31వ తేదీ వరకు పెంచినట్లు డీఈవో కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ/జడ్పీ/ మున్సిపల్ పాఠశాలలలో పనిచేసే స్కూల్ అసిస్టెంట్‌లకు డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో లీప్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తు కాపీలను ఒంగోలులోని డీఈవో కార్యాలయంలోను అందజేయాలని ఆయన కోరారు.

క్విస్ అధ్యాపకురాలికి అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న ధరణి

ఒంగోలు విద్య, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల డీపీఆర్ఎస్ విభాగంలో ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ హెడ్ డాక్టర్ ధరణి ఉత్తమ అధ్యాకురాలి అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని బ్రెయిన్ ఓ విజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ ఎక్సలెన్స్ అవార్డ్స్ కార్యక్రమంలో ధరణికి ఈఅవార్డును అందజేశారు. దేశవ్యాప్తంగా పరిశోధన రంగానికి చెందిన 3వేల మందిలో క్విస్ కళాశాలకు చెందిన ఆమె ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రిదేవి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, డీన్ భార్గవ్‌లు ధరణిని అభినందించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



వరి పైరును పరిశీలిస్తున్న చైర్మన్ దినకర్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో దెబ్బతిన్న పంటలను 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ పరిశీలించారు. పార్టీ నాయకులతో కలిసి గురువారం ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని కొప్పోలులో నీటమునిగిన వరి పైరును పరిశీలించారు. రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వర్షాల వల్ల నష్టపోయిన బాధితకుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని దినకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, నాయకులు నాగేంద్రయాదవ్, దామోదర్, ఉన్నం శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రఘు, రైతులు సుబ్బారావు, హనుమంతరావు, సురేష్, శ్రీను, ఉన్నం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు పరామర్శ

టంగుటూరు (కొండపి), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కొణిజేడులోని ఎస్టీ, బీసీ కులాలకు చెందిన 70 కుటుంబాలు వరద నీటితో ఇబ్బందులు పడుతుండగా, విషయం తెలుసుకున్న డీపీవో వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఆంజనేయులు గురువారం ఉదయం గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారికి సహాయక చర్యలు ప్రారంభించి, వివరాలు నమోదు చేసుకున్నారు

పంటలకు మొంథా దెబ్బ

» పత్తి, కందికి నష్టం » లబోదిబోమంటున్న రైతులు


గిద్దలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట, తాళ్లపల్లి గ్రామాల పరిధిలో పత్తి, కంది రైతులు ఎక్కువగా నష్టపోయారు. 152 ఎకరాల్లో పత్తి, 112 ఎకరాల్లో కంది, 13 ఎకరాల్లో పొగాకుకు నష్టం జరిగిందని రైతు భరోసా కేంద్రం అధికారి మస్తాన్ తెలిపారు. పంట నష్టపోయిన రైతుల విషయం గురించి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ పరిహారం అందించేందుకు కృషి చేస్తామని టీడీపీ మండలాధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి రైతులను పరామర్శించి హామీ ఇచ్చారు.


పంట నష్టం వివరాలను పంపాం

కంభం : మొంథా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగడంతో మండలంలోని పలు పంటలు వరద నీటిలో మునిగినట్లు వ్యవసాయ అధికారి షేక్ మహమ్మద్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో తుఫాన్‌తో దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వరి పంట 160హెక్టార్లు, మినుము 100ఎకరాలు, జొన్న 125ఎకరాలు, అక్కడక్కడా మిరప, ఇతర కూరగాయల మొక్కలు దెబ్బ తినడంతో నష్టం వివరాలను నమోదు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపినట్లు ఆయన తెలిపారు.



















వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం


మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రాన కల్యాణ ఘట్టాలు నిర్వహించారు.






డిగ్రీ పరీక్షలు వాయిదా

దొనకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఈనెల 31 నుంచి నవంబరు 7వరకు జరగాల్సిన ఆంధ్ర కేసరి యూనివర్శిటీ పరిధిలోని డిగ్రీ మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 10 నుంచి 17 వరకు జరుగుతాయని గౌతమీ డిగ్రీ కాలేజీ ప్రిన్స్‌పల్ ఎఫ్రాయిమ్(నాని) తెలిపారు.





దోర్నపువాగుపై హైలెవెల్ చప్టా నిర్మాణానికి కృషి

తాళ్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు-విఠలాపురం గ్రామాల నడుమ గల దోర్నపువాగు చప్టాను హైలెవెల్ చప్టా నిర్మాణానికి కృషి చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం ఆమె దోర్నపువాగు చప్టాను పరిశీలించారు. తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతాంగానికి నష్ట పరిహారం అందేలా చూడాలని ఏవోకు సూచించారు. కాగా, తాళ్లూరు-కుంకుపాడుమార్గంలోగల దోర్నపు వాగుపై ఏర్పడ్డ పెద్దగుంతను ఎస్‌ఐ సింగంశెట్టి మల్లిఖార్జునరావు యుద్ధప్రాతిపదికన పూడ్పించి వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండాచేశారు. తాళ్లూరు నుంచి వెళ్లే మార్గంలో చప్టాపై పెద్ద గుంత పడటంతో పూడ్పించగా గురువారం రాకపోకలు సాగాయి.

క్రీడల్లో రాణించాలి

కనిగిరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించాలని డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఖోఖో క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖోఖో రాష్ట్ర జట్టుకు స్థానిక ఎంఎస్‌ఎం, ఎమ్మెస్సార్ కళాశాలకు చెందిన ఏడుగురు క్రీడాకారులు ఎంపిక కావటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పీడీ కాశీవిశ్వనాధరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గండిపడిన దొనగొల్ల చెరువు కట్టకు మరమ్మతులు

కనిగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు పంచాయతీలోని దొనగొల్ల వాగు చెరువు కట్ట గురువారం తెగిపోయింది. ఎమ్మెల్యే హుటాహుటీన గుడిపాడులోని సంఘటనా స్థలానికి చేరకున్నారు. మండలపార్టీ అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డిని, అధికారులను అప్రమత్తం చేసి పూడ్పించారు.

వద్దిపాడు చెరువుకు గండి

దొనకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వద్దిపాడు చెరువుకు గండి పడింది. భారీ వర్షాలకు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువుకు పుష్కలంగా నీరు చేరుకుంది. అయితే, బుధవారం సాయంత్రం చెరువు తూము సమీపంలో కట్టకు చిన్న గండి పడింది. అధికారులు పరిశీలించి తగిన చర్యలు చేపట్టకపోవటంతో గురువారం తెల్లవారు జామున గండి పెద్దదై చెరువులోని నీరు వృథాగా పోతుంది. సమాచారం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈ కోటేశ్వరరావు, వీఆర్వో హుస్సేన్ యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు.

నివేశన స్థలాలు మంజూరుచేయాలి

కురిచేడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కురిచేడు ఎస్సెస్సీ కాలనీలో నివాసం ఉంటున్న తమకు నివేశన స్థలాలు మంజూరుచేయాలని గురువారం తహసీల్దార్ రజనీకుమారిని మహిళలు కోరారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు కాలనీలో గృహాలు నివాసయోగ్యంగా లేకపోవడంతో అధికారులు ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో తలదాచుకున్నామని చెప్పారు. తమకు నివేశన స్థలాలు ఇప్పిస్తే గృహాలు నిర్మించుకుంటామని తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సహాయంచేస్తామని తహసీల్దార్ రజనీకుమారి తెలిపారు.







నిత్యావసర సరుకుల పంపిణీ

పామూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని దూబగుంట గ్రామంలోని పునరావాస కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.





టీడీపీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడిగా హాజరత్

పీసీపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడిగా గుంటుపల్లికి చెందిన రాగిపాటి హాజరత్ ఎంపికయ్యారు. ఈమేరకు ఆదేశాలు వచ్చినట్లు ఆయన తెలిపారు.







ఆంధ్రజ్యోతి





ప్రకాశం బ్యారేజ్ వద్ద పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

మొంథా పోయి.. వరద వచ్చె

ప్రవాహం ఇలా..

- శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టులో 4 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.
- పులిచింతల నుంచి గురువారం ఉదయం 6 గంటలకు 4.84 లక్షల క్యూసెక్కుల వరద నీరు బ్యారేజికి వదిలారు. సాయంత్రానికి 1.51 లక్షల క్యూసెక్కులకి తగ్గించారు.
- కీసర వాగు, మునేరు నుంచి 1.49 లక్షలు, పాలేరు నుంచి 23,967 క్యూసెక్కుల వరద వచ్చి నదిలో చేరుతోంది.
- ప్రకాశం బ్యారేజి నుంచి 1.49 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలారు. అది క్రమంగా పెరుగుతూ రావడంతో మధ్యాహ్నానికి 3.82 లక్షలకు, రాత్రికి 5,82,710 క్యూసెక్కులకు పెరిగింది. 69 గేట్లు ఎత్తి నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.

మొంథా ధాటికి మూడు రోజులు జిల్లావాసులు వణికిపోయారు. తుఫాన్ తప్పింది.. ఎండ వచ్చింది.. అని ఊపిరిపీల్చుకుంటున్న తరుణంలో వరద ముప్పు ముంచుకోస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో కృష్ణమ్మ పోటెత్తి ప్రవహిస్తోంది. నదిలో అంతకంతకూ వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో మళ్లీ నదీ తీరప్రాంతవాసులకు వరద ముప్పు తప్పడంలేదు. ఇప్పటికే ప్రభుత్వం కృష్ణా నదీతీర ప్రాంతవాసులు జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతం వెంబడి గ్రామాల్లో అధికారులను అప్రమత్తంగా చేసింది. నిన్నటి వరకు తుఫాన్‌తో వరుణుడు ప్రకోపించి పెనుగాలులతో విరుచుకుపడితే, ఇప్పుడు కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చుతోందని ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

- కృష్ణానదిలో పోటెత్తుతోన్న ప్రవాహం
- తుఫాన్ పోయిందని ఊపిరి పీల్చుకునే లోపే ముప్పు
- నదీ తీరప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు 5.38 లక్షల క్యూసెక్కులు విడుదల

రేపల్లె, తెనాలి అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గడచిన వారం రోజులుగా ఇటు జనం కానీ, అటు అధికారులు విరామం లేకుండా తుపాన్ ముప్పును ఎదుర్కొనేందుకు శ్రమించారు. బుధవారం వాన విరామం తీసుకుంది. గురువారం ఎండ విరగకాసింది. ఇక వర్షాల నుంచి తేరుకోవచ్చని అటు రైతులు, ఇటు ముంపు ప్రాంతాల ప్రజలు ఊపిరిపీల్చుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో కృష్ణానదికి వరద తరుముకొచ్చింది. నదిపై ఉన్న జలాశయాలకు ఎగువన కూడా వర్షాలు పడుతుండటం వరదకి కారణమైంది. మొంథా తుఫాన్ తీరం దాటే సమయంలో తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు కురిసాయి. దీంతో ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలతో వరద నీరు మునేరు నుంచి కీసర ద్వారా ప్రకాశం బ్యారేజికి చేరుతోంది. అటు పల్నాడు జిల్లాలో కురిసిన వర్షాలకు అక్కడా వాగులు పొంగుతుండడంతో నదిలో వరద ప్రవాహం పెరిగింది. నాగార్జున సాగర్ నుంచి పులిచింతలకు, పులిచింతల నుంచి బ్యారేజికి వదులుతున్న నీటి స్థాయి కచ్చితంగా తెలుస్తున్నా, బ్యారేజి (మిగతా 6వ పేజీలో)

అపార నష్టం..
నిండా మునిగిన రైతులు



తుఫాన్ దెబ్బకు లంక గ్రామాల్లో దెబ్బతిన్న అరటి చేలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. తుఫాన్ బీభత్సం ఇంకా పొలాల్లో ముంపు రూపంలో కనిపిస్తోంది. వర్షాలు తగ్గుముఖం పట్టి 24 గంటలు గడుస్తున్నా ఇంకా పొలాలు చెరువులనే తలపిస్తున్నాయి. నల్లమడ వాగులో వరద ప్రవాహంతో పలు ప్రాంతాల్లో గండ్లు పడ్డాయి. దీంతో వేల ఎకరాల వరిపైరు మరింతగా ముంపు బారినపడింది. ప్రాథమిక అంచనాల ప్రకారమే జిల్లా వ్యాప్తంగా 82,500 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ తేల్చగా తుది నివేదికల్లో ఈ సంఖ్య మరింతగా పెరగనుంది. 66,000 ఎకరాల్లో వరి ముంపు బారిన పడింది. చేలల్లో నిలిచిన నీటిని బయటకు పంపించడానికి రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలో దాదాపు 40,000 క్వింటాళ్ల పొగాకు దెబ్బతిన్నది.

24 పునరావాస కేంద్రాల కొనసాగింపు

మొత్తం 158 పునరావాస కేంద్రాల్లో 14,000 మంది వరకు తుఫాన్ బాధితులు తలదాచుకున్నారు. గురువారం నాటికి 24 కేంద్రాలు కొనసాగుతుండగా 1,400 మంది వరకు ఇంకా ఆశ్రయం పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 385 చెట్లు నేలకొరగగా అన్నింటినీ తొలగించారు. 116 కరెంటు స్తంభాలకు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేశారు. ఈదురుగాలుల ధాటికి 33 హోర్డింగ్, ఫ్లెక్సీలు తెగిపడ్డాయి.



కారంచేడు కొమ్మమూరు కాల్వ వద్ద పడిన గండ్లను మంత్రులకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

మంత్రులు పార్థసారథి, రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో నష్టపోయిన వారు అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రులు కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. పర్చూరు, కారంచేడు మండలాల్లో వారు గురువారం పర్యటించి రైతులను పరామర్శించారు. జాతీయ రహదారిపై టోల్ గేట్ వద్ద పర్చూరు వాగుకు గండిపడిన ప్రాంతాన్ని మంత్రులు పరిశీలించారు. వాగులు మూసేసినందునే వరద సంభవించిందని రైతుల ఫిర్యాదుతో సంబంధిత కాంట్రాక్ట్ సంస్థపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొమ్మమూరు కెనాల్ వద్ద గండ్లు పడిన ప్రాంత్రాన్ని, పర్చూరు వాగును పరిశీలించారు. ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న నల్లబర్లీ పొగాకు పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబుముందస్తు అప్రమత్తతతో ఆస్తి ప్రాణనష్టం తప్పిందన్నారు. వాగులు పొంగడంతోనే అపారనష్టం వాటిల్లిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, నియోజకవర్గ అధికారి ఉపకలెక్టర్ లవన్న పాల్గొన్నారు.

హెక్టారుకు రూ.25 వేల పరిహారం ?

- నష్టం అంచనాలకు అధికారులకు మంత్రి అనగాని ఆదేశాలు

రేపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంటలకు జరిగిన నష్టాన్ని పరిశీలిస్తున్నామని హెక్టార్‌కు రూ.25 వేల వరకు పరిహారం ఇచ్చే అవకాశం ఉందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తుఫాన్ ప్రభావంపై అన్ని శాఖల అధికారులతో గురువారం మున్సిపల్ కార్యాలయంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ప్రభావితులైన వారికి సీఎం చంద్రబాబు భారీగా సహాయం ప్రకటించారన్నారు. మత్స్యకారులకు అదనపు సహాయం చేస్తున్నామని, గృహాలు దెబ్బతిన్న వారిని ఆదుకుంటామన్నారు. తుఫాన్ సమయంలో కూటమి పార్టీల నేతలంతా బూత్‌లెవల్ నుంచి రాష్ట్రస్థాయి వరకు సహాయ చర్యల్లో పాల్గొన్నారన్నారు. తుఫాన్ నష్టాలపై అంచనాలను శాఖల వారీగా అధికారులు సత్వరం రూపొందించాలన్నారు. ఎలాంటి విమర్శలకు తావులేకుండా పంట నష్టాలపై నివేదికలను సిద్ధం చేయాలన్నారు. ఏఒక్క బాధితుడికి నష్టం జరగకూడదని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి అనగాని

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.



అద్దంకి పట్టణం వ్యూ

మారనున్న జిల్లా స్వరూపం

- సరికొత్తగా ఏర్పాటు కానున్న డివిజన్లు
- డివిజన్‌గా అద్దంకి.. ఆపై ప్రకాశం జిల్లాలోకి..

(బాపట్ల, అద్దంకి, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం సమగ్ర పరిశీలన లేకుండా.. హడావిడిగా కొత్తగా ఏర్పాటు చేసిన బాపట్ల జిల్లా స్వరూపం ప్రస్తుతం మారనున్నది. పాలనా సౌలభ్యం, శాస్త్రీయ కసరత్తులకు ఆస్కారం లేకుండా గత ప్రభుత్వం జిల్లా ఏర్పాటు చేయగా వాటిని సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లాతో పాటు డివిజన్లు ఏర్పాటులో గతంలో అనేక అభ్యంతరాలు వచ్చినా నాటి పాలకులు పట్టించుకోలేదు. రాజకీయ సిఫారసులకు పెద్దపీట వేస్తూ ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకున్నారు. ఆయా తప్పులను సరిదిద్దే కార్యక్రమానికి ప్రస్తుత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే నియోజకవర్గంలోని మండలాలన్నీ ఓ రెవెన్యూ డివిజన్ గొడుగు కిందకు తేవాలని తాజాగా ప్రభుత్వం సూత్రప్రాయ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం ఉన్న డివిజన్ల స్వరూపం మారనుంది. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో చినగంజాం, ఇంకొల్లు, కారంచేడు మండలాలు చీరాల డివిజన్ కింద, మార్టూరు, పర్చూరు, యద్దనపూడి మండలాలు బాపట్ల రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో పర్చూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్ కిందకు రానున్నాయి. అద్దంకి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడడం దాదాపు ఖాయమైన నేపథ్యంలో ఆ నియోజకవర్గ పరిధిలోని 5 మండలాలు ఆ డివిజన్‌లో భాగం కానున్నాయి. అప్పుడు చీరాల డివిజన్ 5 మండలాలకే పరిమితం కానుంది. పర్చూరు పరిధిలోని ఆరు మండలాలు బాపట్ల లేదా చీరాల డివిజన్‌లోనే పూర్తిగా భాగం కానున్నట్లు తెలుస్తోంది. అద్దంకిని తిరిగి ప్రకాశం జిల్లాలో చేర్చడానికి కూడా ప్రభుత్వం సుముఖంగా ఉందనే సంకేతాలను నేతలు ఇప్పటికే ఇచ్చారు. అదే జరిగితే బాపట్ల జిల్లా 5 నియోజకవర్గాలకు పరిమితం కానున్నది.

నాటి హామీ అమలు దిశగా..

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉన్నప్పుడు అద్దంకి నియోజకవర్గంలోని మండలాలు ఒంగోలు డివిజన్‌లో ఉండగా, జిల్లాల పునర్విభజనలో ఒంగోలు సమీపంలోని అద్దంకి నియోజకవర్గాన్ని చీరాల డివిజన్‌లో చేర్చారు. దీంతో జిల్లా, రెవెన్యూ డివిజన్‌లో పనులకు అద్దంకివాసులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఈ క్రమంలో ఎన్నికల సమయంలో చంద్రబాబు, పాదయాత్రలో లోకేశ్‌లు అద్దంకిని తిరిగి ప్రకాశం జిల్లా పరిధిలోకి చేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి మండలి ఉపసంఘం తీర్మానం మేరకు అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో పాటు అద్దంకిని ప్రకాశం జిల్లా పరిధిలోకి మారేలా నిర్ణయం తీసుకున్నారు. జనవరికి అద్దంకి నియోజకవర్గ ప్రజల కల నెరవేరే అవకాశం ఉంది.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14-ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

తేది : 11-10-2025, ప్రదేశం : గుంటూరు
అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.



మోదేపల్లి సమీపంలో చిలకలేరు ఉధృతికి బ్రిడ్జి సమీపంలో కోసుకుపోయిన రోడ్డు



పేరాయపాలెం సమీపంలో కొట్టుకుపోయిన కొత్తగా నిర్మించిన తాత్కాలిక బ్రిడ్జి

కోసుకుపోయిన రోడ్డు.. కొట్టుకుపోయిన బ్రిడ్జి

అద్దంకికి పలు గ్రామాల నుంచి నిలిచిన రాకపోకలు

అద్దంకి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు పొంగిపొర్లటంతో రోడ్లు బాగా దెబ్బతి న్నాయి. ప్రధానంగా అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం-ఇలపావులూరు రోడ్డులో మోదేపల్లి సమీపంలో చిలకలేరు వాగుపై ఉన్న బ్రిడ్జి వద్ద రోడ్డు భారీగా కోసుకుపోయి పోయింది. గురువారం కూడా చిలకలేరు వాగుకు వరద ఉధృతి కొనసాగింది. పేరాయపాలెం సమీపంలో దోర్నపు వాగు ఉధృతంగా ప్రవహించటంతో ఇటీవల తాత్కాలికంగా నిర్మించిన బ్రిడ్జి కొట్టుకుపోయింది. మూడేళ్ల క్రితం బ్రిడ్జి కుంగినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత తాత్కాలికంగా బ్రిడ్జి నిర్మాణం చేశారు. ప్రస్తుతం ఆ బ్రిడ్జి కూడా కొట్టుకుపోయింది. దీంతో అద్దంకి మండలంలోని ధేనువకొండ, పేరాయపాలెం, ఉప్పునేనివారిపాలెంతో పాటు తాళ్లూరు, చీమకుర్తి మండలాల్లోని పలు గ్రామాల నుంచి అద్దంకికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అద్దంకి నుండి తాళ్లూరు, గంగవరం, బొద్దికూరపాడు కు నడిచే బస్సు సర్వీసులు రద్దు అయ్యాయి. మండలంలోని మరికొన్ని రోడ్లు కూడా దెబ్బతిన్నాయి.

అవీఇవీ

మొంథా పోయి.. వరద వచ్చే

(5వ పేజీ తరువాయి)

క్యాచ్‌మెంట్ ప్రాంతం నుంచి వచ్చి చేరుతోన్న వరద అంచనా లెక్కకు అందడంలేదు. దీంతో అధికారులు శుక్రవారానికి మరింతగా ఉధృతి పెరుగుతుందన్న అంచనాలో ఉన్నారు.

రెండో ప్రమాద హెచ్చరికకు దగ్గర్లో

ప్రకాశం బ్యారేజికి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో ప్రస్తుతం 11 అడుగల మేర నీటి మట్టం కొనసాగుతోంది. గురువారం మధ్యాహ్నానికే వరద ప్రవాహ స్థాయి 3.9 లక్షల క్యూసెక్కులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ప్రకటించారు. 5.67 లక్షలకు నీటి విడుదల స్థాయి పెరిగితే గురువారం రాత్రి 2వ ప్రమాద హెచ్చరిక అమల్లోకి వస్తుందనే అంచనాలో నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారు.

లంక గ్రామాల్లో మళ్లీ భయం

లంక గ్రామాలు మరోసారి భయం గుప్పిట్లోకి చేరాయి. గత వరదలకు సంబంధించి ఏర్పడిన నష్టాల నుంచి తేరుకోక ముందే వరద భయం వెంటాడుతోంది. మిగిలిన పంటలు కూడా దక్కవనే ఆవేదనను రైతులు వ్యక్తం చేస్తున్నారు. లంక గ్రామాలను ఇప్పటికే రెండు దఫాలుగా వరదలు ముంచేశాయి. అరటి మినహా, పసుపు, కంద, మినుము, కూరగాయల సాగు చేస్తున్న రైతులు తీవ్ర నష్టాని చవి చూశారు. నిన్నటి తుఫాన్ పెనుగాలలకు అరటి చెట్లు కూడా కుదలయ్యారు. పసుపు, కంద వంటి దుంప పంట గత నష్టాలను తట్టుకుని కొద్దిగా అయినా దిగుబడిని రైతుకు దక్కనిస్తాయనుకుంటే వరద భయం మళ్లీ వారి ఆశలపై నీళ్లు చల్లుతోంది. నదిలో వరద ఉధృతి పెరగడంతో మంత్రి నాదెండ్ల మనోమర్ గురువారం రాత్రి కొల్లిపర మండలంలోని లంక గ్రామాల్లో పర్యటించారు. తుఫాన్ ను సమర్థంగా ఎదుర్కొన్నామని, వరద విషయంలోనూ భయపడాల్సిన పనిలేదని, దీనిని కూడా అధికమిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందాలి

అధికారులను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి



బూదవాడలో దెబ్బతిన్న మినుము పంటను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

పంగులూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. గురువారం మండలంలోని బూదవాడ, కోటపాడు, కొండమూరు గ్రామాలలో అధిక వర్షాలకు దెబ్బతిన్న మినుము, మొక్కజొన్న, మిరప, పత్తి పంటలను మంత్రి.. రైతులు, అధికారులతో కలసి పరిశీలించారు. పంట నష్టం ప్రాథమిక నివేదిక, ఈ క్రాప్ నమోదు గురించి వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి మంత్రికి వివరించారు. దెబ్బతిన్న పంటల పరిశీలన సమయంలో ఆ సమాచారాన్ని సంబంధిత రైతులకు ముందుగా తెలియజేయాలన్నారు. నష్టపోయిన పంటల నమోదు విషయంలో అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. ఈ క్రాప్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు. అధిక వర్షంతో మినుము పూర్తిగా దెబ్బతిందని, మిరప ఉరకెత్తే పరిస్థితి ఉందని రైతులు మంత్రి దృష్టికి తెచ్చారు. బూదవాడ గ్రామంలో ధనలక్ష్మీ కాలనీలో నివాసగృహాల మధ్య నిలిచిన నీటిని పరిశీలించారు. కోటపాడు ఉన్నత పాఠశాలలో కూలిన ప్రహరీని పరిశీలించి పునర్నిర్మాణానికి తగిన అంచనాలు వెంటనే తయారు చేయాలని ఏఈ హనుమంతరావును ఆదేశించారు. కొండమూరు గ్రామంలో పంటలను పరిశీలించిన మంత్రి ఆ తర్వాత ఒరిగిఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే సరిచేయాలని ఈఈ మస్తానరావును ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అనంతరాజు, ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ సింగారావు, ఏడీఈ దామోదరం, మండల టీడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, పీఏసీఎస్ అధ్యక్షుడు రావుల సంగరకొండ, అల్లంనేని బ్రహ్మానంద స్వామి, అలవల రామిరెడ్డి, బత్తుల వెంకటరావు, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, చింతల సహదేవుడు, సుబ్బారెడ్డి, ఆదిరెడ్డి, గడ్డం నాగేశ్వరరావు, కాటా అంజయ్య, చిలుకూరి వెంకటేశ్వర్లు, మురకొండ సుబ్బారావు, కాజా, ఉన్నం రవి, వినయ్ పాల్గొన్నారు.

బంగారు గొలుసు అపహరణకు యత్నం

ఎదిరించిన మహిళలు

చైన్‌ను పడవేసి పరారైన దొంగ



గొలుసు లాగిన యువకుడిని అడ్డుకుంటున్న మహిళలు

అద్దంకి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కలవకూరు రోడ్డులో వైఎస్‌ఆర్ అపార్ట్‌మెంట్ ఎదరు చిల్లరకొట్టులోని మహిళ మెడలోని బంగారు గొలుసును దొంగిలించేందుకు యత్నించిన యువకుడిని మహిళలు అడ్డుకున్నారు. స్థానికుల కథనం మేరకు... కలవకూరు రోడ్డులో బడ్డీ దుకాణం వద్దకు గురువారం సాయంత్రం ఒక యువకుడు వెళ్లాడు. దుకాణదారు గురవమ్మను వాటర్ బాటిల్ అడిగాడు. ఇచ్చిన తరువాత మరో బాటిల్ అడగడంతో తీసుకొచ్చేందుకు దుకాణంలోకి వెళ్లింది. ఆ సమయంలో యువకుడు కూడా లోపలకెళ్లి ఆమె మెడలోని బంగారు గొలుసును లాగాడు. ఎదురు ఎదురు తిరిగి ఆ యువకుడిని బయటకు నెట్టింది. ఈ విషయాన్ని గమనించిన సమీపంలో మహిళా బేల్దారి కూలీ వచ్చి దొంగకు చెందిన మోటార్‌సైకిల్ తాళం తీసింది. దీంతో దొంగ దుకాణంలో ఉన్న కత్తి తీసి బెదిరించాడు. దీంతో తాళం ఇచ్చారు. బంగారం గొలుసును అక్కడే పడవేసి దొంగ మోటార్‌సైకిల్‌పై కలవకూరు రోడ్డులో పరారయ్యాడు. విషయం తెలుసుకున్న సీఐ సుబ్బరాజు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు.

జగనన్న కాలనీల్లో కన్నీళ్ల వెతలు

కనీస వసతులు కల్పించకుండానే నివేశన స్థలాల కేటాయింపు

ఒత్తిడి చేసి మరీ ఇళ్ల నిర్మాణాలు

నేటికీ వసతులు లేక పేదల అవస్థలు



బొమ్మనంపాడురోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో రోడ్లపై నిలిచి ఉన్న నీరు

అద్దంకి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నేతల నిర్లక్ష్యపు పాపం నేడు పేదలకు శాపంగా మారింది. 'జగనన్న' పేరుతో కాలనీని ఏర్పాటు చేసినా కనీస వసతులు ఏర్పాటు చేయలేదు. అయినప్పటికీ, నాటి వైసీపీ పాలకులు వీటిని కాలనీలు కాదని, కొత్త ఊళ్లని ఊదరగొట్టారు. తీరా ప్రస్తుత పరిస్థితిని చూస్తే ఆ కాలనీలు నివాసయోగ్యం కాని చిట్టడవులుగా మారాయి.

వైసీపీ నేతల డాంభికాలు నమ్మి...

అద్దంకి పట్టణంలోని సుమారు రెండు వేల మంది లబ్ధిదారులకు వైసీపీ ప్రభుత్వంలో మూడు చోట్ల కాలనీలు ఏర్పాటు చేశారు. అధికారులు, పాలకుల ఒత్తిడితో ప్రభుత్వం ఇచ్చే డబ్బులకు తోడు లక్షల రూపాయలు సొంత డబ్బులు ఖర్చు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేనాటికీ, ఆయా కాలనీలలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని నాడు నేతలు గొప్పలు చెప్పారు. ఎలాంటి మౌలిక వసతులు కల్పన చేపట్టకుండానే లబ్ధిదారులపై ఒత్తిడి చేసి గృహ ప్రవేశాలు చేయించారు. గత్యంతరం లేక పలువురు నివాసం ఉంటున్నారు. రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, మంచి నీటి వసతులు కల్పించలేదు.



అంతర్గత రోడ్లు లేక నిలిచిన వర్షం నీరు

చిట్టడవులను తలపిస్తున్న కాలనీ

బొమ్మనంపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ అద్దంకి పట్టణానికి సుమారు 4 కి.మీ దూరంలో ఉంది. కనీస రవాణా వసతి కూడా లేదు. అక్కడ వెయ్యి మందికి స్థలాలు కేటాయించగా ప్రస్తుతం పదుల సంఖ్యలోనే నివాసం ఉంటున్నారు. అదే సమయంలో పెద్ద ఎత్తున చిల్లచెట్లు పెరిగి ప్రస్తుతం కాలనీ చిట్టడవిని తలపిస్తోంది. కాలనీకి వెళ్లే బొమ్మనంపాడు రోడ్డులో చినుకుపడితే వాహనాలు నడిచే పరిస్థితి లేకుండా పోయింది. వేలమూరిపాడు రోడ్డు, నాగులపాడు రోడ్లలో ఏర్పాటు చేసిన కాలనీలలో ఎక్కువ మంది లబ్ధిదారులు నివాసాలు ఉంటున్నా, వసతుల కల్పన మాత్రం జరగలేదు. దీంతో వర్షం కురిసినా ప్రతిసారి రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కనీస వసతులు లేకపోవడంతో పలువురు ఇళ్లను వదిలేసి అద్దంకి పట్టణంలో ఇళ్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఆయా కాలనీలలో మౌలిక వసతుల కల్పనపై ఇంకా దృష్టి పెట్టకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి.

ఫీడర్ కెనాల్‌కు గండ్లు

పొలాలపై ప్రవహించిన వరద

పంటలను కాపాడుకోలేక రైతుల అవస్థలు



యడవల్లి వద్ద తెగిన ఫీడర్ కెనాల్

పెద్దదోర్నాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ రైతుల పాలిట శాపంగా మారింది. మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి వరద పోటెత్తి ఫీడర్ కాలువకు చేరడంతో కటకానిపల్లె, యడవల్లి వద్ద కాలువకు గండ్లు పడ్డాయి. వరద నీరు పంట పొలాలపై ప్రవహించడంతో మిరప, అరటి, పత్తి తదితర పంటలు నీట మునిగాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన పైర్లు నీటిపాలవ్వడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల కష్టం, పెంచిన పైరు మళ్లీ ఎప్పటికి వస్తుందని వాపోతున్నారు. నాలుగు రోజులుగా తిమ్మాపురం, కడపరాజుపల్లె, ఐనముక్కల, పెద్ద బొమ్మలాపురం, కొత్తూరు జమ్మిదోర్నాల, చిన్నగుడిపాడు, చిన్నదోర్నాల, రామచంద్రకోట తదితర గ్రామాల్లో నీటి వరద ప్రవాహం తగ్గలేదు. పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

గుండ్లకమ్మకు తగ్గని వరద ఉధృతి

బయటపడని ఊటబావులు...

అద్దంకి వాసులకు నీటి కష్టాలు...

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ నది

అద్దంకి,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): అద్దంకి చుట్టూ వరద నీటి ప్రవాహం ఉన్నా.. పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మొంథా తుఫాన్ ప్రభావంతో మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గుండ్లకమ్మ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నది ఎగువ ప్రాంతాలలో వర్షం నీరుతో గురువారం కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అద్దంకి పట్టణానికి మంచినీటి సరఫరా చేసే ఊటబావులు కూడా నీట మునిగాయి. ఈ రెండు ఊటబావుల నుంచే అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్, కాకానిపాలెం ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటి పంపింగ్ చేసి 90శాతం పట్టణంలోని కాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఊటబావులు నీటమునగగా, అక్కడికి వెళ్లే విద్యుత్‌లైన్ కూడా దెబ్బతింది. అక్కడ విధులు నిర్వహించే ముగ్గురు సిబ్బంది వరదలో చిక్కుకోవడంతో అతి కష్టం మీద ఒడ్డుకు చేర్చారు. వరద ఉధృతి గురువారం కూడా కొనసాగడంతో ఊటబావుల నుండి నీటి పంపింగ్ పునరుద్ధరించలేదు. దీంతో మున్సిపల్ అధికారులు 5 ట్యాంకర్లు ఏర్పాటు చేసి పట్టణంలో పేదలు నివశించే కాలనీలకు సరఫరా చేస్తున్నారు. అయితే ఆ నీరు కొన్ని ప్రాంతాలకు మా త్రమే సరఫరా చేస్తుండడంతో మిగిలిన అన్ని ప్రాంతాల ప్రజలు తాగునీటితో పాటు సాధారణ వినియోగం కోసం కూడా ఇబ్బంది పడుతున్నారు.



7వ వార్డులో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న ప్రజలు

గుండ్లకమ్మ నదిలో దూకిన వృద్ధుడు



విచారిస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ నదిలో దూకి వృద్ధుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన పట్టణంలోని భాగ్యనగర్ 2వ లైనులో చోటుచేసుకొంది. కాలనీకి చెందిన మాచాబత్తిన నాగబ్రహ్మాచారి(63) మానసిక, శారీరక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. గురువారం మెడికల్ షాపుకు వెళ్లి మందులు తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. నేరుగా, గుండ్లకమ్మ నది వద్దకు వెళ్లి దుస్తులు విప్పి నదిలో దూకినట్లు భావిస్తున్నరు. వాహనచోదకులు ఈ విషయాన్ని గమనించి స్థానికులకు చెప్పారు. నాగబ్రహ్మాచారి ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు వెతకడం ప్రారంభించారు. పోలీసులకు విషయం తెలియడంతో సీఐ సుబ్బరాజు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. వంతెనపై ఉన్న చెప్పులు ఆధారంగా నాగబ్రహ్మాచారిగా కుటుంబసభ్యులు గుర్తించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆఖరి మజిలీకి మొంథా దెబ్బ

పెద్ద దోర్నాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్‌తో తాకిడికి మండలం అతలాకుతలమైంది. ఎక్కడ చూసిన వరద, బురదమయంగా మారింది. ఆఖరి మజిలీకి కూడా తుఫాన్ అవస్థలు తప్పలేదు. మండలంలోని ఐనముక్కల గ్రామంలో మృతదేహాన్ని స్మశానానికి తరలించేందుకు బంధువులు బురదలో నానాఅగచాట్లు పడ్డారు. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని కోరుతున్నారు.

తుఫాన్ బాధితులకు అండగా ప్రభుత్వం

రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య

తీరప్రాంత గ్రామాలైన పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లిలో పర్యటన



బింగినపల్లి చెరువుకట్టను పరిశీలిస్తున్న దామచర్ల సత్య

సింగరాయకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ వలన నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య భరోసా కల్పించారు. మండలంలోని తీరప్రాంత గ్రామాలైన పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి గ్రామాల్లో ఆయన గురువారం టీడీపీ నేతలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. తొలుత బింగినపల్లి పంట చెరువును పరిశీలించారు. ప్రమాదహేతువుగా ఉన్న రింగ్‌బండ్‌ను పటిష్టం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఊళ్లపాలెం పంచాయతీ పరిధిలోని బేసిన్‌పల్లెపాలెం, దేవళంపల్లెపాలెం, బావివద్దపల్లెపాలెంలో లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షపు నీటిని వెంటనే బయటకు పంపించి క్లోరినేషన్ చేపట్టాలని అధికారులకు సూచించారు. తదనంతరం పాకల పోతయ్యగారిపట్టపుపాలెం, క్రాంతినగర్, పాకల బీచ్‌లో పర్యటించారు. మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావంతో వేటకు వెళ్లని మత్స్యకారులను కూడా ప్రభుత్వం ఆదుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు. సోమరాజుపల్లి పంచాయతీలోని గిరిజనకాలనీ అప్పాపురం పర్యటించి గిరిజనుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్‌బీవీ రాజేష్, పలుశాఖల అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



డ్రైనేజీ చర్యలు చేపట్టిన అధికారులు

డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనపై అధికారుల దృష్టి

వేటపాలెం(చీరాల), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభావంతో నీటమునిగిన గ్రామాలపై అధికారులు దృష్టి సారించారు. ఈక్రమంలోనే వేటపాలెం మండలం చల్లారెడ్డి పాలెంలో వర్షం నీరు భారీగా చేరడంతో గ్రామంలో నుంచి నీటిని తొలగించేందుకు ఎంపీడీవో రాజేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తి, వేటపాలెం ఎస్సై జనార్ధన్ చర్యలు చేపట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో కాలువ తవ్వించి నీటిని తొలగించారు. వారి వెంట పంచాయతీ అధికారులు ఉన్నారు.

నామ్ రోడ్డుపై వాహనాలు ఉంచితే చర్యలు

అద్దంకి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని నామ్ రోడ్డుపై వాహనాలు నిలిపి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బరాజు అన్నారు. పట్టణంలోని పోతురాజుగండి వద్ద పలు దుకాణాల ముందు పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసి ఉంచడంతో గురువారం సీఐ సుబ్బరాజు పరిశీలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. పలువురు వాహనచోదకులకు అపరాధ రుసుము విధించారు. మరికొన్ని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



నామ్ రోడ్డుపై ఉంచిన ద్విచక్రవాహనచోదకులకు, దుకాణాల యజమానులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బరాజు

ప్రమాద స్థాయికి గుండ్లకమ్మ ప్రవాహం

సప్లై చానల్‌ను వెడల్పు చేసి నీటి మళ్లింపు

ఊపిరిపీల్చుకున్న ప్రజలు

బేస్తవారపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలో కురిసిన వర్షానికి కంభం చెరువు పూర్తిగా నిండి అలుగుపారుతున్న నేపథ్యంలో బేస్తవారపేటలోని సోమవారపేట వద్ద సీతురేలు కతువకు నీటి ప్రవాహం ప్రమాదస్థాయికి చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం ఉదయానికి భారీగా వరద పారుతుండడంతో కతువ చానల్ ద్వారా నీరు వెళ్లలేక సమీపంలోని గృహాలు, పంట పొలాల్లోకి చేరింది. దీంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అధికారులు ఎక్స్‌కవేటర్ సాయంతో సప్లై చానల్‌ను వెడల్పు చేసి నీటిని బయటకు పంపడంతో అది మార్కాపురానికి చేరింది. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. వారితోపాటు మార్కాపురం డీఎస్పీ నాగరాజు, సీఐ మల్లికార్జున, తహసీల్దార్ జితేంద్ర, ఇండ్లా శేఖర్‌రెడ్డి ఉన్నారు.

అవీ..ఇవీ..

చెక్‌డ్యాంలను పరిశీలించిన వాటర్‌షెడ్ బృందం



చెక్‌డ్యాంలను పరిశీలిస్తున్న డ్వామా ఏపీడీ సింగయ్య, బృందం

పంగులూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కెళ్లపాడు, కొండమూరు గ్రామాలలో 2009-10 ఆర్థిక సంవత్సరంలో వాటర్‌షెడ్ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన చెక్‌డ్యాంలు, చెక్‌వాల్స్, చిన్న ఊటకుంటలను వాటర్‌షెడ్ శిక్షణ సిబ్బంది గురువారం పరిశీలించారు. ఎన్‌ఐఆర్‌డీ ద్వారా ఈటీసీ బాపట్ల కేంద్రానికి వచ్చిన వాటర్‌షెడ్ శిక్షణ సిబ్బంది క్షేత్రపర్యటనకు వచ్చిన సిబ్బంది స్థానిక రైతులతో మాట్లాడారు. చెక్‌డ్యాంల ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. డ్వామా ఏపీడీ బత్తిన సింగయ్య నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఏపీవో సంతోషం, డ్వామా సిబ్బందితో పాటు ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీవోగా కోటయ్య బాధ్యతల స్వీకరణ

బల్లికురవ, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండల ఉపాధి హామీ పథకం ఏపీవోగా గురువారం డి.కోటయ్యనాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఇన్‌చార్జ్ ఏపీవో రమాదేవిని జిల్లా అధికారులు పనులలో అవకతవకలపై సస్పెండ్ చేశారు. బాపట్ల జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న కోటయ్య నాయక్‌ను బల్లికురవకు పీడీ విజయలక్ష్మీ నియమించారు. నూతన ఏపీవో కోటయ్యనాయక్ ఎంపీడీవో కుసుమకుమారిని కలిసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఉపాధి హామీ పథక క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. జాబుకార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ, ఈ కేవైసీని వెంటనే పూర్తి చేయాలన్నారు. పనులలో ఎక్కడ లోపాలు ఉన్నా, కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో ఈసందర్భంగా హెచ్చరించారు. ఇప్పటికే బల్లికురవ మండలంలో పనిచేస్తున్న అయిదుగురు ఉపాధి సిబ్బందిని ఇద్దరు క్షేత్ర సహాయకులను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతతో పని చేయాలని ఆమె కోరారు.

విద్యార్థుల్లోని పదునైన ఆలోచనలు చరిత్రను సృష్టిస్తాయి..

- నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రస్తోగి



అవార్డు ఆవిష్కరణలో పాల్గొన్న ప్రతినిధులు

చీరాల, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి) : విద్యార్థుల లోని పదునైన ఆలోచన లు చరిత్రను లిఖిస్తాయని నేషనల్ రీసెర్చ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డా.అమిత్ రస్తోగి అన్నారు. 'చీరాల గీతా యంగ్ సైంటిస్ట్ ఆవిష్కార్ అవార్డ్ - 2025' కార్యక్రమం గురువారం న్యూఢిల్లీ పితాంపురలో నిర్వహించారు. ఆంధ్ర, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాలకు చెందిన 25 మంది విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం, జ్ఞాపిక, ధ్రువీకరణపత్రం అందజేశారు. 2022 నుంచి సుమారు 100 మంది విద్యార్థులతో రూపొందించిన ఆవిష్కరణలు దేశానికి అందించినట్లు ప్రోగ్రామ్ చైర్మన్ వలివేటి మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రాతి ముఖమండప నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న వీరాంజనేయులు

అద్దంకి ,అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి):శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండప నిర్మాణానికి పంగులూరు మండలం భగవాన్‌రాజుపాలేనికి చెందిన రావిపాటి వీరాంజనేయులు, పద్మావతి దంపతులు, కుటుంబసభ్యులు గురువారం రూ.1,01,116లను ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావుకు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం దాతలను పూజారులు ఆశీర్వదించారు.









కొత్తపాలెం కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, చేనేత కాలనీలో నీటిలో నిలబడిన కుటుంబం, కోతపడ్డ పర్చూరు- కారంచేడు రహదారి, కడవకుదురులో రైతులతో మాట్లాడుతున్న ఏలూరి

అతలాకుతలం

- నీట మునిగిన పంట పొలాలు
- తగ్గని ఉధృతి.. పొంగి పొర్లుతున్న వాగులు
- కొనసాగుతున్న సహాయ కార్యక్రమాలు
- నష్టాన్ని పరిశీలించిన ప్రజాప్రతినిధులు

చీరాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను చీరాల నియోజకవర్గ ప్రజలను పూర్తిగా ముంచేసింది. పంటపొలాలు సైతం మోకాళ్ల లోతు నీటిలో ఉన్నాయి. అలాగే చేనేత కార్మికుల మగ్గాలు సైతం నీళ్లల్లోనే ఉన్నాయి. ఇప్పుడిప్పుడే విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. నియోజకవర్గంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటనష్టాలపై అంచనాలు వేస్తున్నారు. వాడరేవు - రామాపురం మార్గంలో వంతెనల కూల్చివేత పరంపర కొనసాగుతుంది. ఇప్పటికే రెండు వంతెనలు పూర్తిగా కూలాయి. ఒక చప్టా అధ్వానంగా మారి రాకపోకలు నిలిచింది. అయితే గురువారం రామాపురం వద్ద మిగిలి ఉన్న చివరి వంతెన కూడా కూలిపోయింది. ఉదయం నుండే ఎమ్మెల్యే కొండయ్య అధికారులతో కలిసి ముందుగా రామకృష్ణాపురంలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. అలాగే వేటపాలెం మండలం కొత్తపాలెం లిఫ్టిరిగేషన్‌ను పరిశీలించారు. అడ్డంగా నిలిచిన గుర్రపు డెక్కను అధికారులకు సూచనలు చేసి తొలగించి వర్షపు నీటిని తొలగించే చర్యలు చేపట్టారు. ఇంకా కొన్నిచోట్ల పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. అయితే సాధారణ స్థితికి చేరేందుకు కొంత సమయం పడుతుందని స్థానికులు భావిస్తున్నారు.

చినగంజాం : మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు అప్పేరు, కొమ్మమూరు కాలువలకు భారీగా వరద వచ్చింది. దీంతో గొనసపూడి, కడవకుదురు, చింతగుంపల్లె ప్రాంతాల్లో వేసిన వరి పైరు పూర్తిగా నీట మునిగింది. దీంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. గొనసపూడి ప్రాంతంలోని పూర్ణ భాస్కర్ లిఫ్ట్‌ఇరిగేషన్ కింద 125 ఎకరాలలో సాగు చేస్తున్న వరి పైరు మూడు రోజులుగా వరదనీటిలో ఉండి పంట దెబ్బ తిందని రైతులు తెలిపారు. ఇప్పటికి వరకు పంటసాగుకు రూ.20వేలు ఖర్చుచేసినట్లు వివరించారు. పంట పొలాలను వరద ముంచెత్తడంతో పెట్టిన ఖర్చు బూడిదలో పోసిన పన్నీరులా అయిందని రైతులు కేశన వెంకట్రావు, పొద రామాంజనేయులు, నక్కల సోమయ్య, తోటకూర హరిబాబు, వసంతరావలు ఆవేదన వ్యక్తం చేశారు. నీలాయపాలెం ప్రాంతంలో 320 ఎకరాల్లో పోసిన వరినార్లు, 90 ఎకరాల్లో ఎదపెట్టిన వరి పంట నాగన్నవాగు వరదనీటికి పైర్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు నీలాయపాలెం రైతులు తెలిపారు. కొమ్మమూరు కాలువకు 15 గండ్లు పడినట్లు నీటిపారుదల శాఖ ఏఈ ఎ.శ్రీదర్ తెలిపారు. పెదగంజాం గ్రామంలోని పోలేరమ్మ గుడి వద్ద నుంచి ఎన్టీఆర్ వారిధి వరకు రహదారిపై నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ముందుజాగ్రత్తగా రాకపోకలు నిలిపివేసినట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు.

● పర్చూరులో పర్యటించిన మంత్రులు

పర్చూరు : తుపాను ప్రభావంతో కకావికలమైన పర్చూరు పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించటానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారధి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలసి గురువారం వరద ప్రభావిత ప్రాంతాలను పర్యటించారు. వరద తీవ్రత అధికంగా ఉన్న పర్చూరు, కారంచేడులో మంత్రులు విస్తృతంగా పర్యటించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

● రైతుల సమస్యలపై స్పందన

మంత్రుల పర్యటన సందర్భంగా అన్నంబొట్లవారిపాలెం రైతులు తమ గ్రామానికి కలిపే వంతెన నిర్మాణం అత్యవసరమని విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ, ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చర్చించారు. అదేవిధంగా పర్చూరు సబ్‌స్టేషన్ వద్ద డ్రైనేజ్ పైపులు ఏర్పాటు చేయాలని రైతుల వినతిని పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

● అండర్ పాస్‌లు, సర్వీస్ రోడ్లకు కొత్త ప్రణాళిక

వాడరేవు - పిడుగురాళ్ల హైవేపై రెండు అండర్ పాస్‌ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రులు సూచించారు. నాగులపాలెం - కారంచేడు హైవే వద్ద సర్వీస్ రోడ్లలో అవసరమైన చోట వంతెనలు నిర్మించేందుకు ప్రతిపాదన రూపొందించాలన్నారు. అదేవిధంగా కేడబ్ల్యూడీ యూటీ(కెడబ్ల్యుడికే) నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు వెంటనే సిద్ధ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక తుఫాను ప్రభావం తగ్గిన వెనువెంటనే పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తామన్నారు.

ప్రతి రైతుకు న్యాయం చేస్తాం: మంత్రి రవికుమార్

వరదల వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. రైతుల కష్టాలకు తగిన పరిహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు.

సహాయక చర్యలు వేగవంతం : ఎమ్మెల్యే

అధికారులు సమన్వయంతో పనిచేసి సహాయ చర్యలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశించారు. వరద వల్ల ముంపు వాటిల్లిన గ్రామాల్లో నిల్వ నీటిని తొలగించడానికి డ్రైనేజీ పనులను తక్షణం చేపట్టాలన్నారు. అదేవిధంగా తాగునీరు, రవాణా పునరుద్ధరించాలన్నారు.

● వరదనీరు తొలగింపునకు చర్యలు

వేటపాలెం(చీరాల) : మండలంలోని చల్లారెడ్డిపాలెంలో వర్షం నీరు భారీగా చేరింది. దీంతో గ్రామం నుండి నీటిని తొలగించేందుకు ఎంపీడీవో రాజేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తి, వేటపాలెం ఎస్సై జనార్ధన్ చర్యలు చేపట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో డ్రయినేజీ ఏర్పాటు చేసి నీటిని తొలగించారు. వారివెంట పంచాయతీ అధికారులు ఉన్నారు.

వరదప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటన

చినగంజాం : మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన చినగంజాం, ఇంకొల్లు మండలాల్లో పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నివేదికలను త్వరితగతిన రూపొందించాలని చీరాల ఏడీఏ రత్న కుమారికి సూచించారు. కడవకుదురు, చింతగుంపల్లె, గొనసపూడి, భీమవరం ప్రాంతాల్లో నీటమునిగిన వరి పంటలను ఎమ్మెల్యే ఏలూరి స్వయంగా పరిశీలించారు. కడవకుదురు గ్రామానికి చెందిన షేక్ జిలానికి చెందిన కోళ్లఫాంలో వరదనీరు వచ్చి కోళ్ల మృతి చెందడంతో వాటిని పరిశీలించారు.. గ్రామ పరిధిలో 6.14 ఎకరాల తోపుపోరంబోకు భూమి విషయం దొడ్డక బాలకృష్ణ రామకృష్ణలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు. ఆ భూమిని పోరంబోకు భూమిగా మార్చి పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుకు సూచించారు. తుపాను నేపథ్యంలో ఆర్‌బీ.ఛానల్‌కు పడిన గండ్లు వెంటనే పూడ్చాలని డీఈ ప్రసాద్‌ను ఆదేశించారు. రొంపేరు వరదనీరు గ్రామంలోనికి రాకుండా షట్టర్లు ఏర్పాటు చేయాలని డ్రైనేజీ డీఈ డి.సుబ్బారావును ఆదేశించారు. గొనసపూడి కొమ్మమూరు కాలువ నుండి అప్పేరు వాగుకు లాకులు ఏర్పాటు చేయాలని, గొనసపూడి ప్రాంతంలో కొమ్మమూరు కాలువకు పడిన గండ్లను పూడ్చాలని ఆదేశించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన తోటకూర సత్యనారాయణ విషయం ఆయన తెలుసుకొని సత్యనారాయణ నాయనమ్మ శేషమ్మకు ఆర్థిక సాయం అందించారు. ఇంకొల్లు మండలంలోని కొణికి వద్ద కొత్త వరద పరిస్థితిని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. దుద్దుకూరు గ్రామంలో లోలెవల్ వంతెనను పరిశీలించారు. వరదలకు కూలిన వందేళ్ల నాటి రావి చెట్టును పరిశీలించారు. అనంతరం ఊరచెరువు గండిని పరిశీలించి తక్షణమే కట్టవేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్ నాయుడు, పలు శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రహదారులు.. స్తంభించిన రాకపోకలు

పర్చూరు/కారంచేడు : పర్చూరు కారంచేడు మండలాల్లో వరద విలయతాండవం చేస్తోంది. వాగులు, వంకలు కాలువలు పొంగి పొరలుతుండడంతో వేల ఎకరాల్లో సాగుచేసుకున్న పైర్లు జలమయం అయ్యాయి. కొన్ని చోట్ల వరద నీటికి రోడ్లు దెబ్బతిని రాకపోకలు స్తంభిచాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. నియోజకవర్గ కేంద్రమైన పర్చూరు, కారంచేడుకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీనికి తోడు కారంచేడు నుంచి వాడరేవు వెళ్లే వాగుకు గండి పడడంతో పంట పొలాలు పూర్తిగా నీటమునిగాయి.

కొణిదెనరోడ్డులో గుంతల పూడ్చివేత

మార్టూరు : భారీ వర్షాలు కారణంగా మార్టూరు గ్రామంలో కొణిదెన రోడ్డులో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. వాస్తవంగా గతంలో ఏర్పడిన గుంతలు ఈ తుపాను కారణంగా మరింత విస్తరించాయి. మార్టూరు నుంచి ఈ రోడ్డు మీదుగా గొట్టిపాటి నగర్, డక్కలి కాలనీ, విజయనగర్ కాలనీవాసులు, రాజుపాలెం, కొణిదెనవాసులు రోజూ ప్రయాణిస్తుంటారు. గోతులు పెరగడంతో వాహనదారులకు ఇబ్బందిగా ఉండడంతో గురువారం మార్టూరు పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు ఎర్ర గ్రావెల్‌ను ట్రాక్టర్లపై తెప్పించి, గోతులను పూడ్చివేశారు. అనంతరం ఎక్స్‌కవేటర్‌తో మట్టిని చదును చేయించగా, తాత్కాలికంగా వాహనదారులకు గుంతలు సమస్య తీరింది.

నర్సరీలో నీటమునిగిన మొక్కలు

అద్దంకి : మండలంలోని రామాయపాలెంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం నిధులతో ఏర్పాటు చేసిన నర్సరీలోకి వరద నీరు చేరి గురువారానికి కూడా బయటకు వెళ్లలేదు. దీంతో నర్సరీలో ప్రస్తుతం ఉన్న 20 వేల మొక్కలు పూర్తిగా కుళ్లిపోయే ప్రమాదం ఉంది. నీటి లో మునిగిన నర్సరీని గురువారం అటవీశాఖ కూకట్లపల్లి బీట్ ఆఫీసర్ రమేష్ పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. రాజశేఖరరెడ్డి తదితరులు ఉన్నారు.









పుల్లాయపాలెంలో నీటమునిగిన వరి, ఇంకొల్లు కడవకుదురు సమీపంలో కొమ్మమూరు కాలువకు పడిన గండి, కొణిదెన దారిలో గుంతలు పూడుస్తున్న ఎక్స్‌కవేటర్, పర్చూరులో పర్యటిస్తున్న మంత్రి రవికుమార్

భక్తిశ్రద్ధలతో కోటిసోమవారం



వేయిస్తంభాల గుడిలో భక్తుల పూజలు

అద్దంకి, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో అత్యంత పవిత్రంగా భావించే కోటి సోమవారాన్ని గురువారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు శివాలయాలకు వెళ్లి కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని వేయిస్తంభాల గుడి, పాత శివాలయం, కమలేశ్వరాలయం, మండలంలోని మణికేశ్వరం మల్లేశ్వర స్వామి దేవాలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వార్లను దర్శించుకున్నారు.



పాతశివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

తుపాను బాధితులను ఆదుకోవాలి

- వైసీపీ సమన్వయకర్త అశోక్‌కుమార్



మొక్కజొన్నను పరిశీలిస్తున్న అశోక్‌కుమార్

అద్దంకి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులు వెంటనే పరిహారం ఇవ్వాలని వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని కొటికల పూడి, కుంకుపాడు గ్రామాలలో దెబ్బతిన్న పంటలను గురువారం అశోక్‌కుమార్ పరిశీ లించారు. వైసీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, జ్యోతి హనుమంతరావు తదితరులు ఉన్నారు.

● వేటపాలెం(చీరాల) : తుపాను బారిన పడిన బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ నేతలు బీరక సురేంద్ర, కావూరి రమణారెడ్డి అన్నారు. గురువారం వేటపాలెం మండలంలో దేశాయిపేట, విఘ్నేశ్వరకాలనీ, న్యూ.కెపాల్, జగనన్న కాలనీల్లో సురేంద్ర, చీరాల మండలం చీరాల నగర్, కొత్తపాలెం, విజయనగర్ కాలనీ, ఈపూరుపాలెం, బోయినవారిపాలెం ప్రాంతాల్లో రమణారెడ్డి వరద ప్రభావాన్ని పరిశీలించారు. తుపాను కారణంగా రైతులు, చేనేత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందని వెంటనే వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పంటనష్టం వివరాల నమోదు



ద్రోణాదులలో మినుమును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మార్టూరు, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను అధికారులు లెక్కిస్తున్నారు. దీనిలో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం శాస్త్రవేత్తలు మండలంలోని ద్రోణాదుల, బొబ్బేపల్లి గ్రామాలలో దెబ్బతిన్న మినుము, మొక్కజొన్న పంటలను పరిశీలించారు ద్రోణాదుల గ్రామంలో 300 ఎకరాల మినుము పంట దెబ్బతిన్నట్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలకు మండలంలో దెబ్బతిన్న పంటల గురించి ఏవో రామినేని లావణ్య వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ మరిత, డాట్ సెంటర్ సమన్వయకర్త అచ్చుతరాజు, ఎంటమాలజిస్ట్ డాక్టర్ వి అనిల్‌కుమార్ లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రైతులతో ఏవో లావణ్య మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల ద్వారా పంట నష్టం వివరాలను సేకరిస్తున్నామన్నారు. పంటనష్టం 33 శాతం కంటే ఎక్కువ ఉంటే రైతుల పేర్లు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

తుపాను కారణంగా మండలంలో ఉద్యాన పంటలు మిరప, అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో గురువారం మండలంలోని జొన్నతాళి గ్రామంలో దెబ్బతిన్న మిరప పంటను రైతులతో కలిసి ఉద్యానశాఖ అధికారి బి.హనుమంత్‌నాయక్ పరిశీలించారు. వర్షపునీరును పొలం నుంచి 48 గంటలలో బయటకు పంపించే ఏర్పాట్లును చేసుకోవాలని సూచించారు.

బల్లికురవ: మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటల పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మార్టూరు ఉద్యానవన అధికారి హనుమంత్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని ముక్తేశ్వరం, నక్కబొక్కలపాడు గ్రామాలలో భారీ వర్షాలతో దెబ్బతిన్న కూరగాయల పంటలను ఉల్లి పంటను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొప్పాయి, అరటి తోటలు సాగు చేసిన రైతులు చెట్టు మొదులు వద్ద మట్టిని నింపాలన్నారు. అలానే పత్తి, మొక్కజొన్న పైర్లను ఏవో శ్రీనివాసరావు పలు గ్రామాలలో పరిశీలించారు. ముందస్తుగా జిల్లాకు ప్రాథమిక అంచనాలను తయారు చేసి పంపామని పొలాల్లో నీరు తగ్గగానే పరిశీలించి దెబ్బతిన్న పంటల వివరాలను సేకరిస్తామన్నారు.

అద్దంకి : పంటపొలాలలో నిలిచిన వర్షపు నీటిని వెంటనే బయటకు పంపించాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఎప్రాయం అన్నారు. మండలంలోని అద్దంకి, కలవకూరు, శంఖవరప్పాడు,, ధర్మవరం గ్రామాలలో దెబ్బతిన్న పొలాలను ఏవో కొర్రపాటి వెంకటకృష్ణతో కలిసి పరిశీలించారు. మొక్కజొన్న కోత దశలో ఉన్నందున నీరు బయటకు పంపాలన్నారు. వరికి 30 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేయాలన్నారు. మినుము పూర్తిగా దెబ్బతిన్నందున నష్టాన్ని లెక్కించాలన్నారు. రైతులు వెంటనే పంట నష్టం వివరాలను సిబ్బందికి తెలియజేయాలన్నారు.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కుమారస్వామి

పంటనష్టం వివరాలను కేంద్రానికి అందజేస్తా

పంగులూరు : తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటల పరిస్థితిని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేస్తానని కిసాన్ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గురుపాటి కుమారస్వామి అన్నారు. కొండమూరులో తుపాను కారణంగా దెబ్బతిన్న మినుము పైరును స్థానిక రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ మండల రామ కృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జాగర్లమూడి యలమందరావు, మంగమేరి సురేష్, కొల్లికోటేశ్వరరావు, అంజిరెడ్డి, కోటిరెడ్డి, నారపరెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.



నదిలో ఇరుక్కున్న పడవలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న రెస్క్యూ బృందాలు

హమ్మయ్యా.. ఉత్కంఠ వీడింది!

- సురక్షిత ప్రాంతానికి డ్రెడ్జింగ్ పడవలు
- ఏజెన్సీ అవగాహన లోపం.. అధికారుల నిర్లక్ష్యం
- జిరాపేరులో వరద ఉధృతికి కొట్టుకొచ్చిన పడవలు
- సంగం బ్యారేజీకి తప్పిన ముప్పు
- ఇటు యంత్రాంగం, అటు రైతాంగంలో హైటెన్షన్
- మంత్రులు లోకేష్, అనిత అభినందనలు

8

కోరం లేక జడ్పీ సమావేశం వాయిదా

నెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేని కారణంగా వాయిదా పడింది. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన గురువారం సమావేశం జరగాలని ముందుగా నిర్ణయించారు. అయితే మొంథా తుఫాన్ నేపథ్యం, ఆగ్రోస్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఉత్తరక్రియలు ఉండడంతో సభ్యులు సమావేశానికి హాజరుకాలేదు. ఉదయం 10.30 గంటలకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమావేశానికి విచ్చేశారు. అప్పటికి ఇద్దరు జడ్పీటీసీ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. సమావేశం నిర్వహణకు కోరం సరిపోకపోవడంతో గంటపాటు చైర్‌పర్సన్ వాయిదా వేశారు. ఆ తర్వాతికి ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. అప్పటికీ సరిపడా కోరం లేకపోవడంతో నిబంధనల ప్రకారం సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు అరుణమ్మ ప్రకటించారు. తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహించాలన్నది సభ్యులు, అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు. కాగా సర్వసభ్య సమావేశం సందర్భంగా జడ్పీ అధికారులు తయారు చేసిన అజెండా వివాదంగా మారింది. ఈ సమావేశానికి శాశ్వత ఆహ్వానితుల జాబితాలో జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య అధ్యక్షుడు కొండ్రెడ్డి రంగారెడ్డి పేరును చేర్చారు. అయితే రంగారెడ్డి పదవీ కాలం గత నెలాఖరుతోనే ముగిసింది. అయినా దానిని పట్టించుకోకుండా ఇంకా రంగారెడ్డికి ఆహ్వానం పంపడంపై చర్చనీయాంశంగా మారింది.



నెల్లూరు : మూలస్థానేశ్వరుడి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కోటి దండాలు స్వామీ..!

- భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం
- హరిహర క్షేత్రాల్లో సందడి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కోటి సోమవారం పర్వదినాన్ని గురువారం జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకు న్నారు. వేకువ జామునే నదీ, సముద్ర స్నానాలు ఆచరించి శివాలయాల్లో అభిషేకాలకు బారులుతీరారు. ముక్కంటికి ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, బల్వార్చనలు, విశేష పూజలు జరిగాయి. ప్రదోష సమయంలోనూ అభిషేకాలు జరిపారు. భక్తుల హరనామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. కొందరు భక్తులు ఉపవాస దీక్ష చేపట్టి సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించి సర్వేస్వరుడిని దర్శించుకుని దీక్షను విరమించారు. శైవ క్షేత్రాల్లో రాత్రి ఆకాశ దీపోత్సవాలు, కుంభహారతులు, ప్రాకారోత్సవాలు కనుల పండువగా జరిగాయి. అదేవిధంగా శ్రవణ నక్షత్రం సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో ఉత్సవాలు జరిగాయి. పెంచలకోన, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, మాగుంటలేఅవుట్ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీవారికి విశేష అభిషేకాలు, తులసీదళ అర్చనలు, ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులతో ఆలయాలు కిట కిటలాడాయి.

యధాతథంగానే..

- గూడూరు నెల్లూరుకు.. కందుకూరు ప్రకాశంకు..
- రూపుమారనున్న నెల్లూరు జిల్లా
- ఒకే రెవెన్యూ డివిజన్ కిందకు ఉదయగిరి
- నెరవేరనున్న స్థానికుల ఆశలు
- ప్రజల అభిష్టానికి సీఎం చంద్రబాబు పెద్దపీట

గూడూరు.. నెల్లూరు జిల్లాలోనూ.. కందుకూరు... ప్రకాశం జిల్లాలోనూ కలవబోతున్నాయా!? అక్కడి ప్రజల కల నెరవేరనుందా!? జిల్లాల పునర్వ్యవస్థీకరణ క్రమంలో రాజధాని కేంద్రంగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తే... ఇది నిజమేనని అనిపిస్తోంది. గూడూరు, కందుకూరు నియోజకవర్గాల ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోయే రోజులు దగ్గర్లోనే ఉన్నట్లు రాజకీయ వర్గాల సమాచారం. అలాగే మూడు రెవెన్యూ డివిజన్ల కింద మగ్గుతున్న ఉదయగిరి నియోజకవర్గం ప్రత్యేక రెవెన్యూ డివిజన్‌గా రూపాంతరం చెందనుంది.

నెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పడిన కొత్త జిల్లాల కారణంగా గూడూరు, కందుకూరు నియోజకవర్గాలు తీవ్రంగా ఇబ్బందిపడ్డాయి. పార్లమెంట్ నియోజకవర్గం ప్రామాణికంగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడంతో గూడూరు తిరుపతి జిల్లాకు, ప్రకాశం జిల్లాలోని కందుకూరు నెల్లూరు జిల్లాలో కలిశాయి. దీంతో ఈ రెండు నియోజకవర్గాల ప్రజలకు జిల్లా కేంద్రాలు దూరం అయ్యాయి. కందుకూరు నుంచి ఒంగోలుకు 45 కిలోమీటర్లు. అదే కందుకూరు నుంచి నెల్లూరుకి 120 కిలోమీటర్లు. జిల్లా కేంద్రం మారడంతో ఆ ప్రాంత ప్రజలు జిల్లా కేంద్రానికి రావాలంటే దూరం మూడు రెట్లు పెరిగింది.

● ఇక గూడూరు విషయానికి వస్తే ప్రస్తుత జిల్లా కేంద్రమైన తిరుపతికి 112 కిలోమీటర్లు. ఇదే నియోజకవర్గంలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు అయితే మరో 20 కిలోమీటర్లు అదనంగా పెరుగుతుంది. అదే నెల్లూరుకు అయితే కేవలం 40 కిలోమీటర్లే. నియోజకవర్గంలోని ఏ మండల కేంద్రం నుంచి అయినా నెల్లూరుకు పట్టే ప్రయాణ సమయం 30 నుంచి 45 నిమిషాలు మాత్రమే. కొత్త జిల్లాల ఏర్పాటుతో కందుకూరు, గూడూరు వాసులకు రవాణా ఖర్చులు పెరగడంతోపాటు ప్రయాణ సమయం కూడా పెరిగిపోయింది.

● **అధికారులకు రోజంతా పని**

ఈ ప్రాంతాల నుంచి మండల అధికారులు ఏదైనా సమీక్షకు జిల్లా కేంద్రానికి వెళ్లి రావాలంటే ఒక రోజు పని. అదే పాత జిల్లాలు అయితే మధ్యాహ్నానికి పనిచేసే ప్రాంతాలకు చేరుకునే వారు. పైగా ఈ రెండు నియోజకవర్గాలకు అనాదిగా పాత జిల్లా కేంద్రాలతోనే మానవ సంబంధాలు ఎక్కువ. గూడూరు ప్రజలకు నెల్లూరు, కందుకూరు ప్రజలకు ఒంగోలుతో ఉన్న అవినాభావ సంబంధాలు, కొత్త జిల్లా కేంద్రాలతో లేవు.

● **ఆ 3 మండలాల పరిస్థితి ఏమిటి?**

వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని సైదాపురం, రాపూరు, కలువాయి మండలాల పరిస్థితి ఏమిటనే విషయం అంతుపట్టడం లేదు. ప్రస్తుతం ఈ మూడు మండలాలు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. వైసీపీ హయాంలో వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని అన్నీ మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేయగా, అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పట్టుబట్టి ఈ మూడు మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగేలా మార్పు చేయించారు. ఈ మండల ప్రజలకు తిరుపతి చాలా దూరం అవుతుందని, తిరుపతి జిల్లాలో విలీనం చేస్తే రెవెన్యూ పరంగా కూడా చిక్కులు ఎదురవుతాయని ఆనం అప్పటి జగన్ ప్రభుత్వాన్ని ఒప్పించి ఈ మూడు మండలాలను నెల్లూరులోనే కొనసాగేలా చేశారు. ఇప్పుడు ఈ మూడు మండలాలు నెల్లూరు జిల్లాలోనే ఉంటాయా!? లేదా తిరుపతి జిల్లాలో కలుస్తాయా!? అనే విషయం అంతుపట్టడం లేదు.

మాట ఇచ్చిన చంద్రబాబు, లోకేష్

ఎన్నికల ప్రచారాల సందర్భంగా గూడూరు, కందుకూరు ప్రాంతాలకు వచ్చిన చంద్రబాబు ఆ రెండు నియోజకవర్గాల ప్రజల కష్టాలను గమనించారు. టీడీపీ అధికారంలోకి వస్తే గూడూరును నెల్లూరు జిల్లాలోనూ, కందుకూరును ప్రకాశం జిల్లాలోనూ కలుపుతామని హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ కూడా ప్రజలకు మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకునే దిశగా సీఎం చర్యలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఈ రెండు నియోజకవర్గాలు పాత జిల్లాల్లో విలీనం అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.



ఉదయగిరి : ఆర్డీవో కార్యాలయం ఏర్పాటుకు అధికారులు గుర్తించిన బాలికల వసతిగృహం

● **రెవెన్యూ డివిజన్‌గా ఉదయగిరి**

మూడు రెవెన్యూ డివిజన్ల కింద ఉన్న ఉదయగిరి నియోజకవర్గం ప్రత్యేక రెవెన్యూ డివిజన్‌గా రూపాంతరం చెందనుంది. ఎనిమిది మండలాలతో జిల్లాలోనే పెద్ద నియోజకవర్గంగా ఉదయగిరి ఉంది. ప్రస్తుతం ఈ నియోజకవర్గ పరిధిలోని మండలాలు మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో

- మిగతా 6లో..

గన్.. అదిరెన్!

● ఆకట్టుకున్న పోలీస్ ఓపెన్ హౌస్ 8లో..

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. తుఫాన్ అనంతరం తీసుకుంటున్న చర్యలు, వాటి పురోగతిపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో గురువారం కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో 3,635 కుటుంబాలు వసతి పొందాయని తెలిపారు. అదనంగా 13,512 మత్స్యకార కుటుంబాలు, 106 చేనేత కుటుంబాలు తుఫాన్ ప్రభావితులుగా ఉన్నాయని తెలిపారు చేనేత కుటుంబాలకు సంబంధించి పక్కాగా సర్వే చేయాలన్నారు. వారందరికీ నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని కోరారు. సహాయక చర్యల్లో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా సహాయం అందేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.



రాళ్లపాడు ప్రాజెక్టులో ఒక గేటు ద్వారా మన్నేరుకు విడుదలవుతున్న నీరు

'సోమశిల'కు భారీగా పెరిగిన వరద

అనంతసాగరం అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద పెరుగుతోంది. బుధవారం 48,330 క్యూసెక్కులు వస్తుండగా గురువారం సాయంత్రానికి 80వేల క్యూసెక్కులకు పెరిగింది. దిగువకు గేట్ల ద్వారా 78,460 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. డ్యాంలో 71.851 టీఎంసీలు నిల్వ ఉంది. దిగువకు వదులుతున్న వరద ఎక్కువవడంతో పెన్నాపరిసరాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

● **రాపూరు :** కండలేరు డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 58.83 టీఎంసీల నీరు ఉన్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1,530 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా, 2,480 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెళ్తుందని అధికారులు పేర్కొన్నారు.

● **లింగసముద్రం :** రాళ్లపాడు ప్రాజెక్టులో ఒక గేటును ఎత్తి మన్నేరుకు వరద నీటిని విడుదల చేశారు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో 2400 క్యూసెక్కుల వరద వస్తుండడంతో ప్రాజెక్టు డీఈలు ఎం వెంకటేశ్వర్లు, శేషయ్య, ఏఈ బి మనోహర్‌లు 3వ గేటును 1.5 అడుగల మేర ఎత్తి 1,850 క్యూసెక్కుల నీటిని మన్నేరుకు విడుదల చేశారు. గురువారం ఉదయం వరద ప్రవాహం తగ్గడంతో గేటును దించేశారు. ప్రాజెక్టులోకి 580 క్యూసెక్కుల మేర నీరు వస్తోందని, నీటిమట్టం 19.8 అడుగులు ఉందని అధికారులు తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏపీటీఎస్ఏ నాయకులు

జిల్లా ఖజానా అధికారిగా శ్రీనివాసులు

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఖజానా అకౌంట్స్ అధికారిగా (ఎఫ్ఏసీ) బి.శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులును ఏపీటీఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● **పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జీఎంగా...**

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జీఎంగా జీ.చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడున్న మారుతీప్రసాద్ పదోన్నతిపై విజయవాడకు బదిలీ అయిన విషయం తెలిసిందే. నూతన జీఎంను నియమించే వరకు తిరుపతి జిల్లా పరిశ్రమల శాఖ జీఎం చంద్రశేఖర్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. నగరంలోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో ఆయనకు ఏడీ శ్రీనివాసులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

'హౌసింగ్'లో విచారణ

- నాణ్యత పరిశీలనకు ప్రభుత్వం నిర్ణయం
- కాంట్రాక్టర్లు కట్టిన ఇళ్ల పరిశీలన
- థర్డ్ పార్టీకి అప్పగింత.. మొదలైన చెకింగ్
- అధికారులు, కాంట్రాక్టర్లలో గుబులు

తప్పు చేసిన వారు ఎప్పటికీ తప్పించుకోలేరన్న సత్యం మరోసారి హౌసింగ్ శాఖలో నిరూపితమవుతోంది. గత ప్రభుత్వంలో అధికార పార్టీ నేతల అండతో రూ.వందల కోట్ల పేదల సొమ్మును దోచుకున్న భోక్తలు.. ప్రభుత్వం మారాక కూడా ఆ దోచుకున్న డబ్బుతో మేనేజ్ చేసుకుంటూ వచ్చారు. అయితే జరిగిన అవినీతిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. జిల్లావ్యాప్తంగా కాంట్రాక్టర్లు నిర్మించిన ఇళ్ల నాణ్యతను పరిశీలించాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బాధ్యతలను ప్రభుత్వ శాఖలకు కాకుండా థర్డ్ పార్టీకి అప్పగించింది. ఇప్పటికే బిల్లుల చెల్లింపులో అవకతవకలు జరిగాయని, సుమారు రూ.110 కోట్ల వరకూ కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని విజిలెన్స్ అధికారులు నిగ్గు తేల్చారు. ఇప్పుడు క్వాలిటీపై విచారణ జరుగుతుండటంతో మరిన్ని అవకతవకలు బయటపడే అవకాశాలున్నాయి.

నెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం భారీగా ఇళ్లు మంజూరు చేయడంతో గత ప్రభుత్వంలో లేఅవుట్లు వేసి ఈ ఇళ్లను పేదలకు కేటాయించారు. ఆ సందర్భంగా మూడు ఆప్షన్లు ద్వారా ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించగా, ఆప్షన్-3 కింద ప్రభుత్వమే నేరుగా ఇళ్లు కట్టించి ఇచ్చే సౌలభ్యాన్ని కల్పించారు. అయితే హౌసింగ్ అధికారులు వేల సంఖ్యలో ఇళ్లను లబ్ధిదారులకు తెలియకుండానే వారికి నచ్చిన కాంట్రాక్టర్లకు అప్పగించారు. జిల్లాకు 97,500 ఇళ్లు మంజూరవగా వాటిలో ఆప్షన్-3 ఇళ్లు సుమారు 29 వేల వరకూ ఉన్నాయి. వీటిలో 6400 ఇళ్లు పూర్తయినట్లు చూపిస్తుండగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నట్లు చూపిస్తున్నారు. మెజారిటీ ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. నాసిరకంగా బేస్‌మెంట్ కట్టి ఒక్కో ఇంటికి రూ.70 వేల చొప్పున కాంట్రాక్టర్లు మింగేశారు. జిల్లాలో ఇప్పటి వరకూ ఈ ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్లకు బిల్లులు, మెటీరియల్ రూపంలో సుమారు రూ.350 కోట్ల వరకు చెల్లించారు. చాలా చోట్ల ఇళ్ల బేస్‌మెంట్లు కట్టి వదిలేయడం, కొన్ని చోట్ల ఉండేందుకు పనికిరాని విధంగా నాసిరకంగా నిర్మించడంతో గతేడాది సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఆ నేపథ్యంలో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఆ విచారణలో భారీగా అక్రమాలు బయటపడ్డాయి. అయితే అప్పుడు ఇళ్ల నాణ్యత జోలికి వెళ్లలేదు. తాజాగా ప్రభుత్వం పేదల ఇళ్ల నాణ్యతను కూడా పరిశీలించాలని నిర్ణయించింది. గురువారం నుంచి జిల్లాలో థర్డ్ పార్టీ బృందం క్వాలిటీ చెకింగ్ మొదలుపెట్టింది. మొత్తం 17 మంది సభ్యులతో కూడిన ఈ థర్డ్ పార్టీ ప్రత్యేక మిషన్లతో వెంకటేశ్వరపురం లేఅవుట్, కొండ్లపూడి లేఅవుట్లలోని ఇళ్ల నాణ్యతను పరిశీలిస్తోంది.

● **అక్రమార్కుల్లో గుబులు**

ఇకపై నిర్మించే ఇళ్ల విషయంలోనూ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఏఈ నుంచి పీడీ వరకూ ప్రతీ ఒక్కరూ ఇళ్ల నాణ్యతను పరిశీలించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్కడ అవకతకలు జరిగినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ఇలా తాజాగా ప్రభుత్వం పేదల ఇళ్ల విషయంలో తీసుకున్న కీలక నిర్ణయాలు అధికారులు, కాంట్రాక్టర్లలో గుబులు పుట్టిస్తున్నాయి. ఇప్పటివరకూ జరిగిన తప్పులకు తామెక్కడ బలవుతామోనని అధికారులు భయపడుతుండగా, ఇప్పటివరకూ సంపాదించినదంతా తిరిగి కట్టాల్సి వస్తుందోనని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారని హౌసింగ్ వర్గాలు చర్చించుకుంటున్నాయి.



పేదల ఇళ్ల నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక మిషన్లతో వచ్చిన థర్డ్ పార్టీ సిబ్బంది

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

అల్లూరు-కావలి మార్గంలో రాకపోకల క్రమబద్ధీకరణ

అల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరదనీరు పోటెత్తి రామన్న చెరువు ప్రమాదకరంగా మారడంతో ప్రమాదాలు జరగకుండా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. అల్లూరు - కావలి రోడ్డుపై రాకపోకలను నిలువరించేందుకు రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన కంపచెట్లను గురువారం తొలగించారు. దీంతో కావలికి వెళ్లేందుకు సున్నపుబట్టి, ఉడ్‌హౌస్‌పేట మీదుగా వెళ్లే పరిస్థితి నుండి నేరుగా ఈ రోడ్డుపై రాకపోకలు కొనసాగించవచ్చని అధికారులు తెలిపారు.


కంపను తొలగిస్తున్న ఎక్స్‌వేటర్

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం పూజలు


శివాలయంలో దీపారాధన పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కావలి (టౌన్) అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం కోటి సోమవారం పర్వదినం సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పాతూరు, వెంగళరావునగర్, ముసునూరు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునుంచి భక్తులు అధికసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. దీపాలు వెలిగించి, శివకేశవులను ఆరాధించారు. దీంతో ఆలయాలు కార్తీకశోభను సంతరించుకున్నాయి. కార్తీక మాసంలో కోటి సోమవారం విశేషమైందని, ఈరోజు వ్రతాలు చేస్తే కోరిన కోరికలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు
పెదపవని హైస్కూల్ విద్యార్థుల ఎంపిక

లింగసముద్రం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవని హైస్కూల్‌కు చెందిన బాల బాలికలు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఒంగోలులో జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ స్కూల్ గేమ్స్ సెలెక్షన్స్‌లో అండర్-14 బాలుర విభాగంలో నిశిపాల్, బాలికల విభాగంలో కె పూజిత, కె మహాలక్ష్మి, సీహెచ్ వర్షిణి, డి అనేష, బి శ్రీవ్య, బి హారిక, స్టాండ్ గర్ల్‌గా డి లిఖిత ఎంపికయ్యారు. అలాగే అండర్-17 విభాగంలో ఒ అర్చన, బి చాందిని ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు టి శ్రీనివాస్, పిడి వెంకటక్రిష్ణ తెలియజేశారు. నవంబరు 28, 30 తేదీలలో నరసారావుపేటలో జరిగే అండర్-17 విభాగానికి చెందిన బాలికలు, అదేవిధంగా అండర్-14 విభాగానికి చెందిన బాల బాలికలు చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కాగా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాల బాలికలను హెచ్‌ఎం శ్రీనివాస్, పిడి వెంకటక్రిష్ణ, ఉపాధ్యాయులు, పిఎంసీ కమిటీ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.


ఎంపికైన బాలబాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసులు

వానలతో చెరువులకు జలకళ

లింగసముద్రం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో మండలంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని సాగు చెరువులకు పూర్తి సామర్థ్యంతో నీరు చేరి జలకళను సంతరించుకున్నాయి. ఈ వర్షాలకు మండలంలోని మొగిలిచెర్ల, లింగసముద్రం కొత్త, పాత చెరువులు, విశ్వనాధపురం, వీఆర్ కోట, చినపవని, పెదపవని, మేదరమెట్లపాలెం చెరువులు పూర్తి సామర్థ్యంతో నిండాయి. ఏళ్ల తరబడి పూర్తి సామర్థ్యంతో నిండని పెదపవని, లింగసముద్రం కొత్త, పాత చెరువులు నిండడంతో ఆయా ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే లింగసముద్రం పాత చెరువు అలుగు పారుతోంది. చెరువులు నిండడంతో రైతులు వరిసాగు చేస్తామని చెప్పారు. కొన్ని చెరువుల కింద ఆరేళ్ల తర్వాత వరి పైరు సాగు చేయనున్నట్టు రైతులు పేర్కొన్నారు.


పూర్తి సామర్థ్యంతో లింగసముద్రం పాత చెరువు

మురుగు కాలువలు లేక ఇక్కట్లు

వలేటివారిపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకభూపాలపురంలో మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని వృథా నీరు, వర్షం నీరంతా సిమెంటురోడ్లపైనే నిలుస్తోంది. దీంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరుకు వర్షం నీరు తోడవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. వ్యాధులు ప్రబలుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. అంతేగాకుండా ఆ మురుగు నీటిలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించి మురుగునీరు, వర్షం నీరు రహదారులపై నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


అంకభూపాలపురంలో మురుగు కాలువలు లేక సిమెంటు రోడ్డుపైనే నిలిచిన వర్షపు నీరు

వరదకు దెబ్బతిన్న ఉప్పుటేరు వంతెన

● గ్రావెల్ వేసిన కూటమి నేతలు

లింగసముద్రం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వచ్చిన భారీ వరద నీటికి మండలంలోని పెదపవని గ్రామ సమీపంలోని ఉప్పుటేరు వంతెన దెబ్బతింది. దీంతో మంగళవారం రాత్రి నుండి ఈ వంతెనపై రాకపోకలు నిలిచి పోయాయి. అయితే గురువారం వంతెనపై వరద నీటి ప్రవాహం తగ్గడంతో గ్రామానికి చెందిన కూటమి నేతలు గ్రావెల్ తోలి చదును చేశారు. దీంతో ఉదయం 10 గంటల నుండి వంతెనపై బస్సులు ఇతర వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఈ పనులను తహసీల్దార్ కె కోటేశ్వరరావు, వీఆర్ బ్రహ్మయ్యలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రఫీ,మధు, జనసేన నేత మనోహర్ పాల్గొన్నారు.


పెదపవనిలో వరదలకు శ్లాబు దిమ్మెలు లేచి పోయిన ఉప్పుటేరు వంతెన

నీరు నిలిచిన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు

కందుకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కందుకూరు పట్టణంలోని పలు కాలనీలలో నివాసాల మధ్య వర్షపునీరు నిలిచిపోగా గురువారం మున్సిపాలిటీ సిబ్బంది ఆయా ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్, కేసరిగుంట కాలనీ, ఫైర్ ఆఫీసు ఏరియా, బూడిదపాలెం, గోకరాజుపాలెం, భన్వర్‌లాల్ నగర్,వెంకటేశ్వరరావు నగర్, గుణ్ణం కట్ట దిగువ ఏరియా, కృష్ణబలిజసంఘం, 4వ వార్డులోని ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లారు. నిల్వనీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. దోమల నివారణ చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.


నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వదులుతున్న పారిశుధ్య సిబ్బంది

నేడు రక్తదాన శిబిరం

కందుకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం కందుకూరు సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు టౌన్ సీఐ అన్వర్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్వహించే ఈ రక్తదాన శిబిరంలో యువతీ యువకులు, విద్యార్థినీ విద్యార్థులతో పాటు అన్నివర్గాల ప్రజలు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ


ఉలవపాడు : తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు అందచేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి, సబ్‌కలెక్టర్ హిమవంశీ


కలిగిరి : బాధితులకు చెక్కును అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు

ఉలవపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ముంథా తుఫాన్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బియ్యం, నిత్యావసర సరుకులు గురువారం సాయంత్రం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు, కందుకూరు సబ్‌కలెక్టర్ దామెర హిమవంశీలతో కలిసి పంపిణీచేశారు. ఉలవపాడులోని 1వ నెంబరు రేషన్ షాపు వద్ద పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న 45 కుటుంబాలకు 25 కిలోల బియ్యం బస్తా, కందిపప్పు, చక్కెర, చింతపండు, నూనె, ఉల్లిపాయలు వంటి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, యువనేత మంత్రి నారా లోకేష్‌లు తుఫాన్ మూడురోజులు అధికార యంత్రాంగాన్ని, ప్రజాప్రతినిధులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఆస్తి, ప్రాణం నష్టం జరగకుండా తుఫాన్ బాధితులకు అండగా నిలిచారని కొనియాడారు. ఏళ్ల తరబడి వర్షాలకు నీట మునిగే కాలనీల ప్రజలకు శాశ్వత ఇళ్ల పట్టాలు, పక్కా ఇళ్లు నిర్మించేలా తన వంతు కృషి చేస్తానని, ఇదే విషయం సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. మండలంలో ఆరు తుఫాన్ పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి 530 కుటుంబాలకు ఆశ్రయం కల్పించారని, వారందరికీ ప్రభుత్వం ప్రకటించిన బియ్యం, నిత్యావసర సరుకులు అధికారులు అందచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టీ శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● నిత్యావసర సరుకుల పంపిణీ

కందుకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు రాష్ట్రప్రభుత్వం మంజూరుచేసిన బియ్యం, నిత్యావసర సరుకులను గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సబ్ కలెక్టరు దామెర హిమవంశీతో కలిసి పంపిణీచేశారు. మొంథా తుఫాన్ ప్రభావంతో పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న బాధితులకు ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఐదురకాల నిత్యావసర సరుకులను 3వ నెంబరు రేషన్‌షాపు వద్ద అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుచూపుతో చేపట్టిన చర్యల ఫలితంగా భారీ తుఫాన్ విరుచుకుపడినా ప్రాణనష్టం, భారీగా ఆస్తినష్టం జరగకుండా నివారించగలిగారని తెలిపారు. తుఫాను బాధితులను ఆదుకోవడంలో అధికారులతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు చూపిన చొరవ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లావణ్య, మున్సిపల్ కమిషనర్ అనూష, ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ ఛైర్మన్ చల్లా శ్రీనివాసరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మొంథా తుఫాన్ కారణంగా ఇళ్లలోకి నీరుచేరి పనులకు వెళ్లలేని స్థితిలో ఉన్న పలు కుటుంబాల వారికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్నేహితులు గురువారం కూరగాయలు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం బియ్యం, నిత్యావసరాలు అందజేయటంతో ఎమ్మెల్యే సూచనతో తాము కూరగాయలు పంపిణీచేశామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఉన్నం కొండలరావు, బెజవాడ ప్రసాదు, ఉన్నం వీరాస్వామి, ముచ్చుశ్రీను, కొత్తపల్లి సురేష్, మురారిశెట్టి సుధీర్‌కుమార్, చక్కా వెంకట కేశవరావు, కోట కిషోర్, కాకుమాని ప్రవీణ్, కోరుకొండ అంజిబాబు, చలంచర్ల రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● పశువుల దాణా పంపిణీ

ఉలవపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పశుగ్రాసం కొరత నివారణ చర్యల్లో భాగంగా పశుపోషకులకు గురువారం స్థానిక పశుసంవర్థక శాఖ ఏడీ కార్యాలయంలో పశువుల దాణా పంపిణీ చేశారు. 50 శాతం సబ్సిడీతో మండలంలో 470 దాణా బస్తాలను పంపిణీ చేసినట్లు జిల్లా పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే రమేష్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వలన వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయాలని, అవసరమైన మందులు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ జీ శ్రీధర్‌రావు, ఉలవపాడు సహాయ సంచాలకులు డాక్టర్ జీ సురేష్ నాయుడు, పశు వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఎస్‌కే నజ్మా, అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొల్లినేని ఆర్థిక సాయం

కలిగిరి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ఇటీవల బోర్‌వెల్ లారీ ప్రమాదంలో తల్లిదండ్రులతో పాటు సోదరిని కోల్పోయిన చవలమూడి మేఘన కుటుంబ సభ్యులను తూర్పుదూబగుంటలో గురువారం మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకటరామారావు, మేకపాటి చంద్రశేఖరరెడ్డిలు పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని మాట్లాడుతూ ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. గాయపడిన చిన్నారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. వైద్యానికి తనవంతు సాయంగా రూ. 50 వేలు అందించామన్నారు. కార్యక్రమంలో కొప్పర్తి హజరత్‌రెడ్డి, చి రుకూరుపాటి శివరామాచారి, కడప చినమాల్యాద్రి, స్వర్ణ కొండయ్య పాల్గొన్నారు.

పోకూరులో పారిశుధ్య పనులు

వలేటివారిపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోకూరులో గురువారం పారిశుధ్య సిబ్బంది వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. తుపాన్ ప్రభావంతో వారం రోజులుగా కురిసిన వర్షాలకు పోకూరులో పారిశుధ్యం పడకేసింది. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ శంకర్‌రావు పంచాయతీ పాలకులు, అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీ అధికారులు పారిశుధ్య సిబ్బందిచే వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. అనంతరం వాటర్‌ట్యాంక్‌ను క్లోరినేషన్ చేయించారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌రావు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ఇంటూరి

వలేటివారిపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండలో గురువారం తెలుగుదేశం పార్టీ నాయకుడు కామినేని రఘు కుమారుడు మాల్యాద్రి, అంజలి వివాహ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, మాలకొండ దేవస్థానం మాజీ ఛైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, కామినేని శివయ్య తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనులను ఆదుకోవాలి : మల్లి

బిట్రగుంట. అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల జీవనోపాధి కోల్పోయిన దళిత, గిరిజనులను ప్రభుత్వం ఆదుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి డిమాండ్ చేశారు. బోగోలు తహసీల్దారు కార్యాలయం ఎదుట కోవూరుపల్లి పంచాయతీ అంబేద్కర్ నగర్‌కు చెందిన దళితులతో కలిసి గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. తుఫాన్ బాధితులకు నగదు, సరుకులు ఇంతవరకు పంపిణీ చేయలేదన్నారు. కోవూరుపల్లిలో రియల్ ఎస్టేట్ వ్యాపారి చుట్టూ గోడ నిర్మించడంతో వర్షపు నీరు గ్రామంలో నిలిచిపోయి, స్థానికులు అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత, గిరిజన నేతలు బాపట్ల సత్యవతమ్మ, పొట్లూరి కీర్తి, ఆత్మకూరు మోహన్‌రావు, ప్రసాద్, జడ్డా వాసు, తేజ తదితరులు పాల్గొన్నారు.

విరాళం

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ ఆలయ అనివేటి మండపం నిర్మాణం కోసం పట్టణానికి చెందిన తుమ్మపూడి సుబ్బయ్య, విజయలక్ష్మి దంపతులు వారి కుమారుడు రాఘవ, పావని దంపతులు రూ. 25101 విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులకు ఈ మొత్తాన్ని అందజేశారు.

పారదర్శకంగా పని చేయాలి

కావలి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): నిబంధనలను తప్పక పాటిస్తూ పురపాలనలో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా పారదర్శకంగా పని చేయాలని జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పేర్కొన్నారు. 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2025'లో భాగంగా గురువారం కావలి పురపాలక సంఘ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీహరిరావు, తహసీల్దార్ శ్రీక్రిష్ణప్రసాద్, ఏఈ వెంకటరెడ్డి మాట్లాడారు. పురపాలక సంఘాలలో ఆస్తి పన్ను విధింపు, భవన నిర్మాణ పనుల అనుమతులు, అక్రమ నిర్మాణాలు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణలో ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, ప్రకటన పన్నుల విధింపు సక్రమ వసూళ్ల ద్వారా ఎక్కువ మొత్తంలో ఆదాయ వనరులను సమకూర్చటంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్, మేనేజరు పీ. ఫణికుమార్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టాలని ధర్నా

కావలి, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోడ్లు, డ్రైన్లు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే వాటి నిర్మాణాలు చేపట్టాలని సీపీఎం నేతలు గురువారం కావలి మున్సిపల్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పీ. పెంచలయ్య మాట్లాడుతూ పట్టణంలో డ్రైన్లు సక్రమంగా లేనందున వర్షాలకు కాలనీలు నీట మునుగుతున్నాయన్నారు. దీంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారని చెప్పారు. పట్టణంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు స్పందించి రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు పీ. తిరుపాలు, వై క్రిష్ణమోహన్, బీ క్రిష్ణయ్య, జీ మధుసూధనరావు, మేడా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తుఫాన్‌తో దెబ్బతిన్న రహదారులు

కందుకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాలతో కందుకూరు నియోజకవర్గంలోని అనేక రహదారులు దెబ్బతిన్నాయి. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో అనేక రోడ్లు మోకాటిలోతు గుంతలతో దర్శనమిస్తున్నాయి. మాచవరం నుంచి పరకొండపాడు వెళ్లే రహదారి, కందుకూరు నుంచి కొష్టాలకు వెళ్లే రోడ్డు, విక్కిరాలపేట రోడ్డు నుంచి పలుకూరుకు వెళ్లే రోడ్డు, అనంతసాగరం రోడ్డు దెబ్బతిన్నాయి. అలాగే విక్కిరాలపేట-నరిశెట్టివారిపాలెం రోడ్డు, కందుకూరు నుంచి ఆనందపురం, దొండపాడు మీదుగా మాచవరం వెళ్లే రోడ్డు, వలేటివారిపాలెం - లింగసముద్రం, లింగసముద్రం - మొగిలిచర్ల, చీమలపెంట రోడ్డు, కేపీఎన్ఎం రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గ్రామీణ లింకురోడ్లు, గ్రావెల్ రోడ్లు మరీ అధ్వానంగా ఉన్నాయని, దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేయించి పరిస్థితిని చక్కదిద్దాలని ప్రజలు వాహనదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.


మాచవరం నుంచి పరకొండపాడుకు వెళ్లే రోడ్డు దుస్థితి


పోకూరు - చీమలపెంట రోడ్డు దుస్థితి

ఆధార్ ప్రత్యేక క్యాంపు


ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆదినారాయణరావు, ఎంఈవో-1 రవికుమార్

కొండాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఆదినారాయణరావు, ఎంఈవో-1 రవికుమార్‌లు పరిశీలించారు. పలు పాఠశాలల నుండి 19 మంది విద్యార్థుల వేలిముద్రలు అప్‌డేషన్‌తోపాటు నలుగురు చిన్నారుల నూతన ఆధార్‌కార్డుల కోసం క్యాంపు నిర్వహించామన్నారు. చిన్నారులకు నూతన ఆధార్ కార్డు పొందాలంటే తప్పనిసరిగా పుట్టిన తేదీ సర్టిఫికెటు ఉండాలని వారు తెలిపారు. శుక్రవారం తూర్పుఎర్రబల్లి కాంప్లెక్స్ పరిధిలో ఆధార్ బయోమెట్రిక్ ప్రత్యేక క్యాంపు జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐ రామమోహన్ పాల్గొన్నారు.

తెగిపోయిన రహదారికి మరమ్మతులు


మరమ్మతులు చేయిస్తున్న టీడీపీ నాయకుడు కిలారి నరేంద్ర

కొండాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ పరిధిలో ఆదిమూర్తిపురం నుండి గానుగపెంటకు వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బ తింది. ఉప్పుటేరుకు సమీపంలో సుమారు 30 మీటర్ల దూరం కొట్టుకుపోయింది. ఆదిమూర్తిపురం వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో మండల టీడీపీ కో ఆర్డినేటర్ పోలినేని చంద్రబాబునాయుడు సమస్యను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి టెండరు పూర్తయిందని అధికారులు చెప్పగా, ప్రయాణానికి వీలుగా మరమ్మతులు చేయించాలని చంద్రబాబుకు సూచించారు. దీంతో గానుగపెంట టీడీపీ నాయకుడు కిలారి నరేంద్రతో కలసి మరమ్మతులు చేయించారు.

వంద అడుగుల రోడ్డు సర్వే


సర్వే చేస్తున్న తహసీల్దార్ తదితరులు

కలిగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కలిగిరిలో గురువారం తహసీల్దార్ గిరీష్‌కుమార్ సర్వే చేపట్టారు. వీఆర్‌వో, సర్వేయర్లతో కలసి రోడ్డు విస్తరణకు మార్కింగ్ వేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల కోరిక మేరకు పట్టణంలో రోడ్డుకు మధ్యనుండి ఒక వైపు 50 అడుగులమేర కట్టడాలు, దుకాణాలు తొలగించడానికి మార్కింగ్ వేశామన్నారు. రోడ్డు విస్తరణలో 50 అడుగుల మేర తొలగిస్తే తాము దుకాణాలు, ఇళ్లు పూర్తిగా కోల్పోతామని, తమకు కొంత సడలింపు ఇవ్వాలని స్థానికులు కోరగా, ఉన్నతాధికారులకు తెలియచేస్తామని తహసీల్దార్ తెలిపారు.

జూదరుల అరెస్టు

కందుకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటారెడ్డి నగర్‌లో ఓ ఇంటిలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో గురువారం రాత్రి దాడిచేసి ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ శివనాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. వారి వద్ద రూ. 6130 నగదు స్వాధీనం చేసుకున్నట్టు, కోర్టులో హాజరుపరుస్తామని ఆయన తెలిపారు.



విద్యార్థులకు తుపాకులు చూపించి, వాటి గురించి వివరిస్తున్న పోలీసులు



గన్ పనితీరును వివరిస్తున్న సిబ్బంది



పిస్తోళ్లు భలే ఉన్నాయ్..

గన్.. అటెన్షన్ !

● ఆకట్టుకున్న పోలీస్ ఓపెన్ హౌస్

● ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు

ఒక వైపు పెద్ద గన్... ఆ పక్కనే చిన్న తుపాకీలు.. ఇంకోవైపు రైఫిల్స్.. వాటి తర్వాత బాంబ్ డిస్పోజల్స్... పోలీసు శాఖ ఉపయోగించే ఈ ఆయుధాలు, పరికరాలు విద్యార్థులను అబ్బురపరిచాయి. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ ఉపయోగించే రకరకాల తుపాకులు, ఆయుధాలు, డ్రోన్లు, బాంబులను నిర్వీర్యం చేసే సామగ్రి, ఇతర పరికరాలను ప్రదర్శించారు. వాటి పని తీరును పోలీసు సిబ్బంది వివరించారు. అలాగే డాగ్ స్క్వాడ్, ట్రాఫిక్ విభాగం, విపత్తుల సమయంలో పోలీసులు ఉపయోగించే కమ్యూనికేషన్ వ్యవస్థ, బులెట్ ప్రూఫ్ వెహికల్, కమ్యూనికేషన్ వాహనం, 207 వజ్ర వాహనం, మెటల్ డిటెక్టర్, డ్రాగన్ లైట్, రాకర్, ఫింగర్ ప్రింట్స్, కమ్యూనికేషన్ మ్యాన్‌ప్యాక్ సెట్స్, సెల్ జామర్ వాహనాలు... ఇలా అనేక అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు వాటిని ఎంతో ఆసక్తిగా తిలకించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను సిబ్బంది వివరించారు. మంచి లక్ష్యంతో ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)







బాంబులు నిర్వీర్యం చేసే పరికరాలు ఇవేనండోయ్!

శిక్షణ పొందిన పోలీసు జాగిలాలు

నేటి నుంచి వేదగిరిలో పవిత్రోత్సవాలు

నెల్లూరురూరల్,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏటా నిర్వహించే వేదగిరి పవిత్రోత్సవాలు శుక్రవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయని, ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ట్రస్టు బోర్డు చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ శంకర్‌రెడ్డి తెలిపారు. ఆగమోక్తంగా జరిగే నిత్య, వార, మాస, నక్షత్ర అర్చన, స్నపన, ఉత్సవ, విశేష పూజాదుల్లో తెలిసీ, తెలియని దోషాలను ఈ పవిత్రోత్సవాల ద్వారా తొలగించుకుంటారని, తిరిగి ఆలయ పవిత్రతకు భంగం లేకుండా స్వామి, అమ్మవార్ల సన్నిధిలో విశేష పూజలను యథావిధిగా నిర్వహిస్తారని ఆయన వివరించారు. నవంబరు 3 వరకు ఈ పవిత్రోత్సవాలను అర్చక, రుత్విక్కుల సమక్షంలో యాగాలు, యజ్ఞాలతో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విశేష హోమాలు అనంతరం స్వామివారికి పవిత్రాలు సమర్పణ ఉంటుందని తెలిపారు.

బాలికపై లైంగిక దాడి కేసులో పెంపుడు తండ్రికి జీవిత ఖైదు

● రూ.40 వేల జరిమానా

నెల్లూరు (లీగల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాలికపై పెంపుడు తండ్రే లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో సర్వేపల్లి అంజయ్య అనే నిందితుడికి జీవిత ఖైదు, రూ.40 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.... ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి పట్టణం బంగారుపేట గ్రామం అరుంధతీయ పాళెంకు చెందిన సర్వేపల్లి అంజయ్యకు ఓ వివాహితతో పరిచయం అయింది. ఆమెకు తనే తండ్రిగా వ్యవహరించేవాడు. అయితే ఆ పిల్లల్లో 15 ఏళ్ల బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై సదరు బాలిక 2021 జూలై 19వ తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటగిరి పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ చంద్రశేఖర్ వాదించారు.

నిండుకుండలా నక్కలగండి



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలగండి రిజర్వాయర్‌లోకి వరద నీరు ఉధృతంగా వస్తుండడంతో గురువారం నిండుకుండలా మారి జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరడంతో పూర్తిస్థాయి సామర్థ్యం 22 అడుగుల మేర నీరు చేరింది. నీటిని ఏమాత్రం వృథా కాకుండా అధికారులు చర్యలు చేపట్టి పంటల సాగుకు సహరించాలని రైతులు కోరుతున్నారు.



డ్రెడ్జింగ్ పడవను ఒడ్డుకు చేర్చేందుకు శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు

● బీరాపేరు ప్రవాహంపై అవగాహనలేని ఏజెన్సీ

● నీటిలో కొట్టుకొచ్చిన మూడు డ్రెడ్జింగ్ పడవలు

● వీటి గురించి పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

● బ్యారేజీకి త్రుటిలో తప్పిన ప్రమాదం

● ఇటు యంత్రాంగం, అటు రైతాంగంలో ఉత్కంఠ

● 2వ రోజు విజయవంతంగా ఒడ్డుకు చేర్చిన బృందాలు

నిర్లక్ష్యం.. అవగాహన లోపం

సంగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెన్నా నదిలో నీటిలో ఇసుకను తీసే డ్రెడ్జింగ్ పడవల ఏజెన్సీ అవగాహనలోపం.. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం జిల్లా యంత్రాంగం, అటు రైతాంగంలో ఉత్కంఠ రేపింది. 25 నుంచి 35 టన్నుల బరువుండే మూడు డ్రెడ్జింగ్ పడవలను (సుమారు 100 టన్నుల) తుఫాన్ హెచ్చరికతో నిర్వాహకులు బీరాపేరు వంతెన రైయిలింగ్‌కు మోకులతో కట్టేశారు. భారీ వర్షాలు వస్తే ఎగువ ప్రాంతం నుంచి బీరాపేరుకు భారీస్థాయిలో నీటి ప్రవాహం ఉంటుందని తెలిసిన స్థానిక ఇరిగేషన్ అధికారులు రైయిలింగ్‌కు కట్టిన భారీ పడవల గురించి పట్టించుకోలేదు. కొట్టుకొచ్చిన పడవలు నీటి ప్రవాహంలో మధ్యలో నిలిచిపోబట్టి బ్యారేజీకి పెను ముప్పు తప్పింది. ఒక్కొక్కటి 30 టన్నుల బరువుండే పడవలకు నీటి వేగం తోడై బ్యారేజ్ ప్రియర్స్‌నుగానీ, గేట్లనుగానీ ఢీకొని ఉంటే పరిస్థితి ఏమిటని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

● జిల్లా యంత్రాంగంలో హైటెన్షన్

పడవలు కొట్టుకొచ్చిన విషయం తెలిసిన వెంటనే బుధవారం కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి అధికారులతో సమీక్షించారు. సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో భారీగా వస్తుండగా, అదే ప్రవాహాన్ని సంగం బ్యారేజీకి విడుదల అవుతోంది. ఇదే క్రమం లో బీరాపేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. వీటన్నిటి దృష్ట్యా మధ్యలో ఇరుక్కున్న పడవలను 24 గంటల్లో బయటకు తీయాలి. లేకపోతే బ్యారేజ్‌కి ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. ఇది జిల్లా యంత్రాంగానికి సవాల్‌గా మారింది.



వంతెన రైయిలింగ్‌కు కట్టిన పడవ

● రక్షణ బృందాలు రంగంలోకి..

కలెక్టర్, ఎస్పీలు వెంటనే రెవెన్యూ, పోలీస్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, మత్స్య, అగ్నిమాపక శాఖలు, సముద్రంలో పడవలో చేపల వేట సాగించే నైపుణ్యం ఉన్న మత్స్యకారులను రంగంలోకి దింపారు. ఆ మేరకు ఆయా బృందాలు పడవను గట్టుకు తీసుకురావడం వీలుపడకపోతే అక్కడి నుంచి కదలకుండా స్థిరంగా ఉంచేందుకు చర్యలు చేపట్టే ప్రయత్నం చేశారు. పెన్నానదిలో 11.6 అడుగుల నీటిమట్టంతో 86వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండడంతో వారధి క్రస్ట్ వద్ద ఆగి ప్రమాదకరంగా ఉన్న పడవ వద్దకు సమీపంలోకి వెళ్లేందుకు విశ్వప్రయత్నం చేశారు. కానీ కుదరలేదు.

● 2వ రోజు విజయవంతంగా..

సోమశిల నుంచి నీటి ప్రవాహం తగ్గించడంతో సంగం బ్యారేజ్ వద్ద నీటి ప్రవాహం గురువారం ఉదయానికి 86వేల నుంచి 59 వేలకు తగ్గింది. దీంతోపాటు బీరాపేరు నీటి ప్రవాహం కూడ కాస్త తగ్గింది. దీన్ని ఆసరాగా చేసుకుని పెన్నానదిలో నీటి ప్రవహించకుండా గేట్లన్నీ దించేంచి మధ్యలో ఆగిపోయిన డ్రెడ్జింగ్ పడవలను ఆపరేషన్ బృందాలతో అతికష్టం మీద సురక్షిత ప్రాంతానికి తరలించారు.

● అభినందించిన మంత్రులు

సంగం బ్యారేజీని రక్షించడంతోపాటు పడవలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక, మత్స్య శాఖ, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగంతో టీమ్ వర్క్‌తో విజయం సాధించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల, రెస్క్యూ టీమ్ బృందానికి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ట్విట్టర్‌లో అభినందించారు. అదేవిధంగా హోమ్ మంత్రి అనిత పోలీస్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్, ఇరిగేషన్ ఎస్ఈ రాధాకృష్ణ, వెంకటరమణారెడ్డి, తహసీల్దారు సోమ్లానాయక్, ఈఈ మేకల అనీల్‌రెడ్డి, డీఈ విజయరామిరెడ్డితోపాటు సంగం, ఆత్మకూరు సీఐలు వేమారెడ్డి, గంగాధర్‌తోపాటు మత్స్య శాఖ జేడీ శాంతి, ఎఫ్‌డీవో పొట్టెయ్య, సంగం, ఏయస్‌పేట, ఆత్మకూరు, చేజర్ల, కలువాయి, రాపూరు ఎస్ఐలు తదితరలు పాల్గొన్నారు.

యథాతథంగానే!

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. వెనుకబడిన ఈ నియోజకవర్గంలో సత్వరం అభివృద్ధి పనులు చేపట్టాలన్నా, సమస్యలు పరిష్కరించాలన్నా మూడు డివిజన్ల అధికారులతో చర్చించాల్సి రావడం ఎమ్మెల్యేలకు కష్టతరంగా మారింది. ఈ పరిస్థితి గమనించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరి రెవెన్యూ డివిజన్ కోసం పట్టుపట్టారు. ప్రభుత్వానికి నివేదిక పంపారు. పలుసార్లు రాజధానికి వెళ్లి ప్రత్యేక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం అభ్యర్థించారు. ఎట్టకేలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఉదయగిరి ప్రత్యేక రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సానుకూల వాతావరణం ఏర్పడింది.

● వసతులున్నాయా!?

ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేసేందుకు తగిన వసతులు ఉన్నాయా... పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని కలెక్టరేట్ నుంచి స్థానిక రెవెన్యూ కార్యాలయానికి ఫోన్ చేసి వివరాలు అడిగారు. దీంతో అధికారులు రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు పట్టణంలోని బాలికల వసతిగృహాన్ని పరిశీలించి అనువుగా ఉంటుందని సూచించారు. మిగిలిన వివరాలు తెలియజేయడంతో కలెక్టరేట్ నుంచి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిసింది.

అభివృద్ధికి అడుగులు పడ్డట్లే...

ఉదయగిరి రెవెన్యూ డివిజన్ ఏర్పాటైతే అభివృద్ధికి అడుగులు పడ్డట్లే. రైతులు, ప్రజలు సమస్యల పరిష్కారం సుదూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సైతం డివిజన్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకొన్నారు.

- చింతనబోయిన బయ్యన్న, ఉదయగిరి

మాలేపాటి అకాల మరణం జీర్ణించుకోలేం

● నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి

● ఉత్తరక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రముఖులు



ప్రసంగిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, పక్కన రాజ్యసభ సభ్యుడు మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు తదితరులు

దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, టీడీపీ యువనేత భానుచందర్ నాయుడు అకాల మరణం జీర్ణించుకోలేనిదని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దగదర్తిలోని మాలేపాటి స్వగృహంలో సుబ్బానాయుడు, భానుచందర్‌ల ఉత్తరక్రియలు గురువారం జరిగాయి. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితర ప్రముఖులు తరలివచ్చారు. తొలుత సుబ్బానాయుడు, భానుచందర్‌ల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి మాలేపాటి కుటుంబ సభ్యులు ఎనలేని సేవలందించారని వారితో ఉన్న అనుబంధాన్ని నేతలు నెమరువేసుకున్నారు. అటువంటి నేతలను కోల్పోవడం దురదృష్టకరమని, వారు లేని లోటు పార్టీకి తీర్చలేనిదని అన్నారు. అనంతరం మాలేపాటి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు, కావలి ఏఎంసీ చైర్‌పర్సన్ అలేఖ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతలను ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



ఇన్‌చార్జి ఏడీకి వినతిపత్రం ఇస్తున్న చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):తుఫాను కారణంగా నష్టపోతున్న ప్రతి చేనేతను ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ కోరారు. చేనేత జౌళిశాఖ ఇన్‌చార్జి ఏడీ రమేష్‌తో కలిసి గురువారం ఆయన నారాయణరెడ్డిపేటలోని చేనేత మగ్గాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా దాదాపుగా 4వేల కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవన సాగిస్తున్నారన్నారు. ఉపవృత్తుల మీద మరో 5వేల కుటుంబాలు ఉన్నాయని, తుఫాను కారణంగా మగ్గం గుంతల్లో నీరు చేరడంతో వీరంతా పని కోల్పోయారని చెప్పారు. నష్టపోయిన రైతులను, మత్స్యకారులను ఆదుకున్నట్లుగానే చేనేతలను కూడా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామనాథం రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సోమా గోపాల్, ఉపాధ్యక్షుడు రామసుబ్బయ్య, కార్యదర్శి వెంకటరమణయ్య, చేనేత మహిళలు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు 9 వరకు గడువు

తిరుపతి(విద్య), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షకు నవంబర్ 9వ తేదీ వరకు గడువు పొడిగించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 18వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వయసును బట్టి 4 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు ఈ పరీక్షకు అర్హత ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తు విధానం, అర్హతలు, పరీక్ష విధానం గురించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు 86888 88802, 93999 76999లలో తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ - నవోదయ పోటీ పరీక్షల శిక్షణా కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ

నెల్లూరు(క్రైం),(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు వీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. పోలీసు పరేడ్ మైదానం నుంచి కేవీఆర్ పెట్రోల్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల మాట్లాడుతూ విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసులను స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలన్నారు. ఈ ర్యాలీలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి రజక వృత్తిదారుల తరగతులు



పెన్నా నదీ తీరంలో రజకులతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జక్కా వెంకయ్య భవన్‌లో శని, ఆదివారాల్లో రాష్ట్ర స్థాయి రజక వృత్తిదారుల చైతన్య తరగతులు జరుగుతాయని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి రేకులగుంట అంకయ్య తెలిపారు. వీటిని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని పెన్నా నది వద్ద దుస్తులు ఉతుకుతున్న రజకులను సంఘం నాయకులు కలిశారు. రజక కార్పొరేషన్ ద్వారా ఆదరణ పథకం కింద ఆధునిక పనిముట్లు అందచేస్తామని, 50 ఏళ్లకే పింఛను అందజేస్తామనిఇ ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. వాటిని వెంటనే నెరవేర్చాలని, లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఓడూరు వెంకట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ



కావలిలో బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న మంత్రి ఫరూక్, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి

కావలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలతో ముంపునకు గురైన టిడ్కోకాలనీ వాసులకు రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న నిత్యావసరాలను గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ సమస్యలను ఏకరవుఉ పెట్టారు. త్వరలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తహసీల్దార్ పీ. శ్రావణ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ అలేఖ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

● బంగాళదుంప, ఉల్లి దిగుమతి

నెల్లూరు (వ్యవసాయం) : మొంథా తుఫాను బాధితులను ఆదుకునేందుకు మార్కెటింగ్ శాఖ బంగాళా దుంపతోపాటు ఉల్లిపాయలను అందించేందుకు పౌరసరఫరాల శాఖకు గురువారం సరఫరా చేసింది. 17,253 కేజీల బంగాళాదుంప, 17,253 కేజీల ఉల్లిపాయలను సివిల్ సప్లయీస్ గోదాములకు తరలించినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మత్స్యకారులు, షెల్టర్ల కింద జీవిస్తున్న ఒక్కొక్కరికి కేజీ చొప్పున అందించనున్నట్లు ఏడీ పేర్కొన్నారు.

మినుములో కలుపు నివారణ

● లేకుంటే పంట దిగుబడుల ప్రభావం ● కేవీకే విస్తరణ విభాగం శాస్త్రవేత్త లోకేష్‌బాబు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మినుము పైరులో కలుపు నివారణ చర్యలు తీసుకోవాలని, లేదంటే పంట దిగుబడులపై ప్రభావం పడుతుందని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.లోకేష్‌బాబు తెలిపారు. విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్లు, రసం పీల్చే పురుగుల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చని ఆయన వివరించారు. మినుము సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన ఆంధ్రజ్యోతి ద్వారా రైతులకు తెలియజేశారు.మినుము పైరులో కలుపు నివారణకు విత్తిన మరుసటి రోజు ఎకరాకు 1 నుంచి 1.5లీటర్ల నీటిలో పెండిమిథాలిన్ 30శాతం ద్రావణాన్ని పిచికారీ చేయాలి. విత్తిన 20 నుంచి 25 రోజుల తరువాత గొర్రుతో అంతర్ కృషి చేయాలి. మాగాణి మినుములో ఊద, చిప్పుర, గరిక వంటి గడ్డి జాతి కలుపు మొక్కలను నివారించేందుకు పొలంలో తేమ ఉన్నప్పుడు ఫినాక్సీప్రాప్ ఇథైల్ 9శాతం ఎకరాకి 250 మి.లీ లేదంటే క్విజలోఫాప్ ఇథైల్ 5శాతం ఎకరాకి 400మి.లీ మందును 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల గడ్డి కలుపు నియంత్రణ సమర్థవంతంగా జరుగుతుంది. అలాగే వెడల్పాటి గడ్డిజాతి కలుపు ఉన్నప్పుడు ఇమజితాఫిర్ 5శాతం ద్రావకం 200 మి.లీ 200లీటర్ల నీటిలో కలిపి 20 నుంచి 25 రోజుల్లో పిచికారీ చేయాలి. తేమ ఉన్న సమయంలోనే పిచికారీ చేయాలి. ఇంకా వరి మాగాణి పొలాల్లో బంగారు తీగ నియంత్రణ కోసం వరి పనలు తొలగించిన వెంటనే ఎకరాకు 1.5 లీటర్ల పెండిమిథాలిన్ 30శాతం మందును 20కిలోల ఇసుకలో కలిపి సాయంత్రం సమయాన పొలంలో సమానంగా చల్లాలి. బంగారు తీగ కనిపిస్తే పారాక్వాట్ 10శాతం ద్రావకాన్ని లీటరు నీటికి 5మి.లీను కలిపి తీగ ఉన్నచోట పిచికారీ చేయడం వల్ల పంటను కాపాడుకోవచ్చు.